నవతెలంగాణ
నవ్యత తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
ఆదివారం | అక్టోబర్ 27, 2024 | www.navatelangana.com


పద్మశ్రీ కనక రాజు మృతికి సీపీఐ(ఎం) సంతాపం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఆదివాసీ సంస్కృతిని కాపాడేందుకు విశేష కృషి, సేవలు అందించిన తన గుస్సాడి బృందంతో ప్రపంచ వేదికలపై ఆదివాసీ సంస్కృతి విశిష్టను చాటిన పద్మశ్రీ కనక రాజు మృతికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సంతాపం తెలియజేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మరణం ఆదివాసీ సమాజానికి, సాంస్కృతిక ఉద్యమాల పరిరక్షణ కు, ఉమ్మడి జిల్లా ప్రజలకు తీరని లోటని తెలిపారు. అలాగే తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) జిల్లా కమిటీ సంతాపం తెలుపుతున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, జిల్లా కార్యదర్శి తొడసం భీంరావ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా సీవీఎన్ రాజు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



రాష్ట్రవ్యాప్తంగా పలువురు మున్సిపల్ కమిషనర్లకు స్థానచలనం కల్పిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దాన కిషోర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఎండి ఖమర్ అహ్మద్ సైతం బదిలీ అయ్యారు. ఆయనను నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సివిఎన్ రాజును ఆదిలాబాద్‌కు బదిలీ చేశారు.

పత్తి రైతు చిత్తు..!

- మార్కెట్‌లో కనీసం మద్ధతు ధర కూడా దక్కని వైనం
- తేమ 12శాతం దాటితే కొనుగోలుకు సీసీఐ నిరాకరణ
- ప్రయివేటు వ్యాపారులు నిర్ణయించిన ధరనే దిక్కు
- గత్యంతరం లేక తక్కువ ధరకు విక్రయిస్తున్న అన్నదాతలు
- ధరలో భారీగా నష్టపోతుండటంతో తీవ్ర అసంతృప్తి

దూదిపూల రైతులకు దుఃఖమే మిగులుతోంది. ఆరుగాలం కష్టించి..అనేక కష్టనష్టాలు..ప్రకృతి విపత్తులను ఎదుర్కొని పంట పండించిన రైతులకు మార్కెట్‌లోనూ మద్దతు లభించడం లేదు. అతివృష్టి.. చీడపీడలతో పంట దిగుబడులపై ప్రభావం చూపించగా తీరా చేతికి వచ్చిన అరకొర పంటను సైతం పూర్తి ధరకు విక్రయించలేని దుస్థితి కనిపిస్తోంది. తేమ పేరిట ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ పేచీలు పెట్టడం.. 12శాతం దాటితే కొనుగోలు చేసేందుకు నిరాకరించడం.. ఇటు ప్రయివేటు వ్యాపారులు మద్ధతు ధర కంటే తక్కువగా నిర్ణయించడం వంటి కారణాలతో అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. తొలి రోజున పత్తి కొనుగోళ్లలో సందిగ్ధం నెలకొనడం తీరా ప్రయివేటు వ్యాపారులు నిర్ణయించిన ధరనే ఫైనల్ కావడంతో అన్నదాతలు గత్యంతరం లేని పరిస్థితిలో తక్కువ ధరకే పత్తిని విక్రయించాల్సి వచ్చింది.



ఆదిలాబాద్ గ్రామీణ మండలం చాందా(టి) గ్రామానికి చెందిన రైతు దుమాల అశోక్ 10.61క్వింటాల్‌ల పత్తిని మార్కెట్‌కు తీసుకొచ్చారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7521 ఉండగా తేమతో సంబంధం లేకుండా వ్యాపారులకు క్వింటాల్‌కు రూ.6840చొప్పున విక్రయించారు. రైతు అమ్మిన పత్తికి రూ.72,572 ధర వచ్చింది. కానీ వాస్తవంగా ప్రభుత్వ మద్దతు ధరతో విక్రయిస్తే రూ.78,960 రావాల్సి ఉంటుంది. ఈ లెక్కన సదరు రైతు రూ.6300వరకు నష్టపోవాల్సి వచ్చింది. వీటికి అదనంగా వాహనం అద్దె మరో రూ.4వేలు చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్‌లో అనేక మంది రైతులకు ఇలాంటి పరిస్థితి ఎదురవుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో పత్తి రైతులు ఏటా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పండించిన పంటను మార్కెట్‌లో అమ్ముకోవాలంటే తీవ్ర అగచాట్లు పడుతున్నారు. కేంద్రప్రభుత్వం ఈ ఏడాది వివిధ పంటలను ధరలను స్వల్పంగా పెంచింది. పత్తికి కిందటేడాది క్వింటాల్‌కు రూ.7020 ఉంగా ఈ ఏడాది క్వింటాల్‌కు రూ.500చొప్పున పెంచి రూ.7521గా నిర్ణయించింది. ఈ సారి ధర కాస్త పెరిగిందని సంతోషపడిన రైతులకు మార్కెట్ ప్రారంభంలోనే అవాంతరాలు ఎదురయ్యాయి. మార్కెట్‌కు తొలి పత్తిని తీసుకొచ్చిన రైతులకు కనీసం ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కూడా లభించడం లేదు. 8 నుంచి 12శాతం లోపు తేమ ఉంటేనే పత్తిని కొనుగోలు చేస్తామని సీసీఐ నిబంధనలు విధించింది. కానీ తొలి పత్తి కావడం.. ఇటీవల వర్షాలు కురవడం.. సహజంగానే వాతావరణంలో తేమ ఉండటంతో ఈ ప్రభావం మార్కెట్‌కు తీసుకొచ్చిన పత్తిలో కనిపిస్తోంది. ఒక్కో పత్తి వాహనంలో 15 నుంచి 40వరకు తేమశాతం చూపిస్తోంది. శనివారం మార్కెట్‌లో కొనుగోలు చేసిన వందలాది పత్తి వాహనాల్లో కేవలం 37 వాహనాలకు గాను 672 క్వింటాల్‌లు మాత్రమే కొనుగోలు చేసింది.

తేమతోనే ఇబ్బందులు..!

పత్తిలో చూపిస్తున్న తేమతోనే అన్నదాతలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. 12శాతం తేమ దాటితే కొనుగోలుకు సీసీఐ నిరాకరించడంతో అనేక మంది రైతులు ఈ సంస్థకు పత్తిని అమ్ముకోలేని పరిస్థితి ఉంది. సీసీఐకి విక్రయిస్తే కనీసం మద్దతు ధర అయినా లభిస్తుందని భావించగా.. ప్రస్తుత పరిస్థితి అనుకూలించకపోవడం రైతులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. మరోవైపు ప్రయివేటు వ్యాపారులు క్వింటాల్‌కు కేవలం రూ.7150 మాత్రమే నిర్ణయించారు. వీరికి విక్రయిస్తే తేమ పేరిట ధరలో భారీగా కోత విధిస్తుండటంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. తొలిరోజున రైతుల ఆందోళన కారణంగా తేమతో సంబంధం లేకుండా (గుడుగోన) పద్ధతిలో క్వింటాల్‌కు రూ.6840చొప్పున కొనుగోలు చేశారు. దీంతో అనేక మంది రైతులు గత్యంతరం లేని పరిస్థితిలో ఇదే ధరకు పత్తిని విక్రయించాల్సిన పరిస్థితి తలెత్తింది. మరుసటి రోజు నుంచి ఈ పద్ధతి కొనసాగే అవకాశం లేకపోవడంతో తేమ పేరిట రైతులు మరింత తీవ్రంగా నష్టపోయే ఆస్కారం ఉంటుంది. గిట్టుబాటు ధర పక్కన పెడితే కనీసం మద్ధతు కూడా ధర కూడా దక్కకపోవడంతో అన్నదాతలు తీవ్ర నిరుత్సాహానికి గురవుతున్నారు.



ధర రాకపోవడంతో చాలా నష్టం : పసుల లచ్చన్న, రైతు, జందాపూర్



మార్కెట్‌లో రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కూడా లభించకపోవడం బాధాకరం. 18క్వింటాల్‌ల పత్తిని విక్రయించాను. మద్దతు ధర లభించకపోవడంతో సుమారు రూ.11వేల వరకు నష్టపోవాల్సి వచ్చింది. తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయడంతో పాటు రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

సీపీఐ(ఎం) ఏరియా ప్రథమ మహాసభలు విజయవంతం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ రూరల్ మండలంలోని యాపల్‌గూడలో నిర్వహించిన సీపీఐ(ఎం) ఆదిలాబాద్ ఏరియా ప్రథమ మహాసభలు విజయవంతమయ్యాయని ఆ పార్టీ సీనియర్ నాయకులు లంక రాఘవులు తెలిపారు. ప్రధానంగా మూడు ముఖ్యమైన సమస్యలపై సమావేశంలో తీర్మానం చేశామని తెలిపారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహాసభలో తీసుకున్న కర్తవ్యాలను వివరించారు. ముఖ్యంగా వెనుకబడ్డ ఆదిలాబాద్ ప్రాంతాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పోరాటాలు తీవ్రతరం చేస్తామన్నారు. అదేవిధంగా రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ నిర్వాసిత రైతులకు వారి డిమాండ్‌కు అనుగుణంగా ధరను చెల్లించి భూములు తీసుకోవాలని, పూర్తిస్థాయిలో న్యాయం చేసే దిశగా వారికి భరోసా కల్పించాలన్నారు. అంతేకాకుండా పత్తి క్వింటాల్‌కు రూ.10వేల మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వీటి అమలు కోసం పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో సీపీఐ(ఎం) నాయకులు స్వామి, ఆశన్న, గంగారాం పాల్గొన్నారు.

ఏరియా కమిటీ కార్యదర్శిగా లంక రాఘవులు

సీపీఐ(ఎం) ఆదిలాబాద్ ఏరియా కమిటీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం 15 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. ఏరియా కమిటీ కార్యదర్శిగా లంక రాఘవులు, సభ్యులుగా స్వామి, ఆశన్న, డి.స్వామి, ప్రవీణ్, దాసు, గంగారాం, ఆత్రం కిష్టు, గంగన్న, శ్యామ్‌రావు, మోతీరామ్, రాజక్కతో పాటు 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఆదిలాబాద్, జైనథ్, బేల మండలాల అభివృద్ధికి కృషి చేస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

సబ్ కలెక్టర్, డీఎస్పీ రక్తదానం



నవతెలంగాణ-ఉట్నూర్

పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉట్నూర్ పోలీస్‌స్టేషన్లో పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఎస్పీ నాగేందర్, సీఐ మొగిలి, ఎస్సై మనోహర్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోసం అమరులైన పోలీస్ అధికారులను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, రక్తదానంపై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పేర్కొన్నారు. రక్తం ఇస్తే మరొకరి ప్రాణం కాపాడిన వారమవుతామని తెలిపారు. శిబిరంలో 40 మంది దాతలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ డ్రైవర్లు, నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కనక రాజు మరణం తీరనిలోటు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుస్సాడీ నృత్య కళాకారుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు మృతి గుస్సాడీ నృత్య కళాకారులకు, ఆదివాసీ సమాజానికి తీరని లోటని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. జైనూర్ మండలం మర్లవాయి గ్రామంలో శనివారం కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్కతో కలిసి కనక రాజు మృతదేహానికి నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంత్యక్రియల్లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దామోదర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, మావల మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, రంజిత్ పాల్గొన్నారు.

29న సైన్స్ కళాశాలలో జాబ్ మేళా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న మంగళవారం టీఎస్ కేసి (తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్) ఆధ్వర్యంలో టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) వారి సౌజన్యంతో జాబ్ మేళాను నిర్వహిస్తామని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కెప్టెన్ జగ్రామ్ అంతర్వేది, టిఎస్ కేసి కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రావణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్ మేళాలో ఎంఎస్ఎన్ లాబొరేటరీస్ లిమిటెడ్‌లో జూనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు బీఎస్సీ కెమిస్ట్రీ 2024, 2025లో పాస్ అయి ఉండాలని, 18 ఏళ్ల నిండి, కేవలం మేల్ క్యాండిడేట్స్ అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు ఒక జత రెస్యూమ్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఒరిజినల్ అండ్ జిరాక్స్ సెట్, ఐడి ప్రూఫ్ తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుండి జాబ్ డ్రైవ్ ప్రారంభమవుతుందని, వివరాలకు ఎండి.ఇమ్రాన్ అలీ 7035336262ని సంప్రదించాలని సూచించారు.

రూ.6లక్షలకు ఆశ పడి కేసు తారుమారు

- శ్యాంరావు మృతి కేసులో వెల్లడైన నిజాలు
- అప్పటి రూరల్ ఎస్ఐతో పాటు మరో ముగ్గురిపై సస్పెన్షన్ వేటు
- హత్యకు కారకులను అరెస్ట్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్న పోలీసులు
- ముందే చెప్పిన 'నవ తెలంగాణ'



శ్యాంరావు(ఫైల్)



శ్యాంరావు మృతదేహానికి రీ పోస్టుమార్టం చేస్తున్న ఫోరెన్సిక్ నిపుణులు (ఫైల్)

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కంచె చేను మేస్తే ఏ విధంగా ఉంటుంది. సరిగ్గా అదే జరిగింది కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో. సుమారు మూడు నెలల క్రితం జరిగిన ఒక వ్యక్తి మృతి కేసులో సాక్ష్యాలను తారుమారు చేయడం, అవాస్తవాలను పంచనామాలో పొందుపర్చి కేసును నిర్వీర్యం చేసే ప్రయత్నం చేయడంతో ఓ మహిళా ఎస్ఐతో పాటు మరో ముగ్గురు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. రూ.6 లక్షలు లంచం తీసుకొని వీరంతా కేసును తారుమారు చేసినందున వీరిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు మల్టీజోన్-1 ఐజీ ఎస్ చంద్రశేఖర్‌రెడ్డి తన ఉత్తర్వులలో పేర్కొన్నారు. సస్పెన్షన్ వేటు పడిన వారిలో ఆగస్టులో కాగజ్‌నగర్ రూరల్ ఎస్ఐగా పని చేసి ప్రస్తుతం రామగుండం కమిషనరేట్ పరిధిలోని గోదావరిఖని-2 టౌన్ ఎస్ఐగా పని చేస్తున్న ఎ.సోనియా, కాగజ్‌నగర్ రూరల్ పోలీసుస్టేషన్‌లో పని చేస్తున్న ఎఎస్ఐ ఆర్.మను, హెడ్ కానిస్టేబుళ్ల జె.ఉమేష్, ఆర్.రమేష్ ఉన్నారు.

అసలు జరిగిందేమిటంటే...

కాగజ్‌నగర్ మండలం బురదగూడ గ్రామానికి చెందిన కొట్రంగి శ్యాంరావు(36) ఆగస్టు 3న మృతి చెందాడు. అతను ప్రమాదవశాత్తు ఇంట్లోనే మంచం మీది నుండి కిందపడి మృతి చెందినట్లు మృతుని తల్లి కొట్రంగి భీంబాయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టాల్సిన రూరల్ ఎస్ఐ సోనియా నామమాత్రంగా విచారణ చేపట్టి పంచనామాలో అన్నీ అవాస్తవాలనే పొందుపర్చారు. శ్యాంరావు మృతి చెందిననాటి నుండి ఇది ప్రమాదవశాత్తు జరిగింది కాదని, ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవతోనే శ్యాంరావు మృతి చెందాడని వార్తలు వెలువడ్డాయి. కాని వీటిని పోలీసులు పరిగణలోనికి తీసుకోలేదు. ఇది ఉన్నతాధికారులకు తెలియడంతో మళ్లీ విచారణ చేపట్టాల్సిందిగా ఆదేశాలు రావడంతో ఆగస్టు 16న పాతిపెట్టిన శ్యాంరావు మృతదేహాన్ని వెలికితీసి కాగజ్‌నగర్ ఆర్డీఓ సురేష్, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో రీ పోస్టుమార్టం నిర్వహించారు. ఫోరెన్సిక్ నివేదిక కూడా వారం రోజుల క్రితం పోలీసు శాఖకు అందగా, 12 తీవ్రమైన గాయాల కారణంగానే శ్యాంరావు మృతి చెందాడని వెల్లడైంది.

మధ్యవర్తులతో పోలీసుల కుమ్మక్కు

ఈ కేసును తప్పుదోవ పట్టించడానికి అప్పటి రూరల్ ఎస్ఐ సోనియాతో పాటు సిబ్బంది మను, ఉమేష్, రమేష్ గ్రామానికి చెందిన మధ్య వర్తులు జైరాం, పోశెట్టి, నాందేవ్, మృతుని సోదరుడు సురేష్‌తో కుమ్మక్కయ్యారని సస్పెన్షన్ ఉత్తర్వులలో పేర్కొన్నారు. మధ్యవర్తుల సాయంతో ఎస్ఐతో పాటు సిబ్బంది రూ.6 లక్షలు తీసుకున్నట్లు వెల్లడైనందున వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. మృతుని సోదరుడు సురేష్ ఆర్మీ జవాన్ కావడంతో అతన్ని అదుపులోకి తీసుకునేందుకు పోలీసు బృందం వెళుతున్నట్లు సమాచారం.

ముందే వెలుగులోకి తెచ్చిన 'నవతెలంగాణ'

శ్యాంరావు మృతి పట్ల 'నవతెలంగాణ' ముందు నుండే అనుమానాలు వ్యక్తం చేస్తూ వార్తాకథనాలు ప్రచురించింది. ఇది ప్రమాదం కాదని, గాయాలతోనే మృతి చెంది ఉంటాడని వార్తలు వచ్చాయి. తర్వాత రీ పోస్టుమార్టం చేయగా వాస్తవాలు వెలుగులోకి వచ్చి మహిళా ఎస్ఐతో పాటు మరో ముగ్గురి సస్పెన్షన్‌కు కారణమైంది.



నవతెలంగాణ

హత్యా.. ప్రమాదమా...

వ్యక్తి మృతిపై పోలీసుల మళ్లీ విచారణ

'హత్యా, ప్రమాదమా' అనే శీర్షికతో ఆగస్టు 10న నవతెలంగాణలో వచ్చిన వార్త

అనారోగ్యంతో మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ మృతి

నవతెలంగాణ-భైంసా



మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ మాశెట్టివార్ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. 1981 నుండి 1992 వరకు 10 సంవత్సరాల పాటు భైంసా మున్సిపల్ చైర్మన్‌గా పని చేశారు. దివంగత మాజీ మంత్రి గడ్డెన్నకు అత్యంత సన్నిహితునిగా ఉన్నాడు. ఉమ్మడి జిల్లా డిసిసి అధ్యక్షునిగా కూడా పని చేశారు. గడ్డెన్న ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం దిగంబర్ మాశెట్టివార్ జిన్నింగ్ ఇండస్ట్రీయే అయన కార్యాలయం. సరస్వతి శిశుమందిరాల అభివృద్ధికి పాటు పడ్డారు. తన తల్లి పేరిట కోట్ల రూపాయల విలువైన భూమిని పాఠశాల ఇచ్చారు. అందరితో కలివిడిగా ఉంటూ భైంసాకు పెద్దన్నలా వ్యవహరించారు. 91సంవత్సరాల వయస్సులో కన్నుమూశారు. పలువురు దిగంబర్ సేవలను స్మరించుకుంటున్నారు.

ఎమ్మెల్యే సంతాపం

మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ మాశెట్టివార్ మృతి పట్ల ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి తీరని లోటన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, డిసిసి అధ్యక్షునిగా ఆయన చేసిన సేవలు అమోఘమని తెలిపారు. సరస్వతి శిశు మందిరాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. తన తల్లి పేరిట కోట్లాది రూపాయల విలువైన సుభద్ర వాటిక భూమిని శిశు మందిరం కోసం ఇచ్చారన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

గుడ్ పోలీసింగ్‌ను నెలకొల్పేందుకు కృషి

- ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం
- పోలీసుల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజల భద్రతతో పాటు అదే సమయంలో సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా గుడ్ పోలీసింగ్‌ను నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్పీ గౌస్ ఆలం, డీఎంహెచ్ఓ కృష్ణతో కలిసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అంతకుముందు పోలీసు అమరులకు నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన యుజవన సంఘాలు ఎస్పీ గౌస్ ఆలంను సత్కరించి స్వామి వివేకానంద చిత్రాన్ని బహూకరించారు. ఎస్పీతో పాటు ఆయన సోదరుడు డా.జిలాని, స్నేహితుడు ఐఆర్ఎస్ అధికారి వికాస్ సైతం రక్తదానం చేసి దాతృత్వాన్ని చాటారు. ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడ, ఉట్నూర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాల ద్వారా దాతల ద్వారా 260 యూనిట్ల రక్తాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు సమాజం కోసం నిరంతరం పని చేస్తుంటారని తెలిపారు. పోలీసు అమరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా వారం రోజులుగా వివిధ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని నాలుగు చోట్ల నిర్వహించిన శిబిరాల ద్వారా 260 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో విధుల్లో భాగంగా 59 మంది పోలీసులు అమరులయ్యారని, వారి త్యాగాల ఫలితంగానే నేటి స్వేచ్ఛాయుత పరిస్థితులని వివరించారు. అయితే గతంలో ఉన్న పరిస్థితులు వేరని, ఇప్పుడు అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధిని సాధించామని పేర్కొన్నారు. వైద్యులు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు సురేందర్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, సీఐలు, ఆర్ఎస్ఐలు, వివిధ విభాగాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన సివిల్ సర్వీస్ శిక్షణ అధికారుల బృందం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శిక్షణలో భాగంగా ఆదిలాబాద్‌లో పర్యటిస్తున్న సివిల్ సర్వీస్ శిక్షణ అధికారుల బృందం శనివారం పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించింది. డేవిడ్ వెంకట్రావ్ చనాప్, పవనోట్ కౌర్, సిమ్రన్, ఎండి ఖమరొద్దీన్‌ఖాన్, మోహిత్ రావత్‌తో కూడిన శిక్షణ సివిల్ సర్వీస్ అధికారుల బృందం తొలుత శనివారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శిచారు. ఎంఈవో సోమయ్య, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, పాఠశాల హెచ్ఎం రమేశ్ వారి వెంట ఉండి పాఠశాలలోని మౌళిక వసతులు, విద్యా బోధన, విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి బోధన, అభ్యసన సామర్థ్యాల గురించి వాకబు చేశారు. అనంతరం వారు హమీద్‌పూరలోని ఉర్దూ మీడియం పాఠశాలను సందర్శించారు. హెచ్ఎం అస్లాం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి వారికి స్వాగతం పలికారు. పాఠశాలలోని తరగతి గదులు, గ్రంథాలయం, క్రీడా మైదానం, మధ్యాహ్న భోజనం, కిచెన్‌షెడ్డు, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. వారి వెంట కౌన్సిలర్ ప్రకాష్, లైజన్ అధికారి పన్నాలాల్, వార్డు ఆఫీసర్ పాషా, మెప్మా టీఎంసీ భాగ్యలక్ష్మి ఉన్నారు.

శిక్షణలో భాగంగా పర్యటిస్తున్నాం



ఈ సందర్భంగా శిక్షణ సివిల్ సర్వీస్ అధికారిణి పవన్ జోట్ కౌర్ మాట్లాడుతూ శిక్షణలో భాగంగా ఆదిలాబాద్‌లో పర్యటిస్తున్న తాము ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలను సందర్శించామని తెలిపారు. ఆహ్లాదకర వాతావరణంలో విద్యబోధన సాగుతోందని, అన్ని రకాల మౌళిక వసతులు ఉన్నాయని వివరించారు. మధ్యాహ్న భోజనం, మంచినీరు, క్రీడా మైదానం అన్ని బాగున్నాయన్నారు. ఉపాధ్యాయుల కొరత కారణంగా రెండేసి తరగతులను ఒకే చోటు కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్న విషయాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు.

ఆర్సీఓగా బాధ్యతలు స్వీకరించిన అగస్టీన్

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ ఆర్సీఓ కార్యాలయంలో శనివారం నూతన ఆర్సీఓగా అగస్టీన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో సేవలు చేయడానికి గొప్ప అవకాశం వచ్చిందన్నారు. ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ఉపాధ్యాయుల, విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, ఆర్సీఓకు శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్, ప్రిన్సిపాల్ శ్రీ హరిరాం, ఆర్సీఓ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని దేవాపూర్ గ్రామానికి చెందిన అనుపట్ల లక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధపడుతూ రిమ్స్‌లో చికిత్స పొందుతోంది. బాధితురాలి కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగలేని విషయం తెలుసుకున్న మాల సంక్షేమ మండల నాయకులు విరాళాలు సేకరించి శనివారం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలికి రూ.16వేల నగదును అందజేశారు. నగదు అందజేసిన వారిలో మాల సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు గూకంటి క్రాంతి కుమార్, మాల సంక్షేమ సంఘం మాజీ జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న, మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు హర్ష దేవిదాస్, కొప్పుల వరప్రసాద్, నిమ్మల ప్రశాంత్, శ్రీనివాస్, సూరం రాహుల్ పాల్గొన్నారు.



ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలి

- బెటాలియన్ కుటుంబ సభ్యుల ఆందోళన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బెటాలియన్ పోలీసులు వారి కుటుంబ సభ్యులు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతున్న విషయం విధితమే కాగా అందులో భాగంగానే శనివారం ఆదిలాబాద్‌లోనూ నిరసనకు దిగారు. పట్టణంలోని కలెక్టర్ చౌరస్తాలో యాపల్‌గూడ రెండో పోలీసు బెటాలియన్ వారి కుటుంబ సభ్యులు కదిలివచ్చి రాస్తారోకో చేపట్టారు. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్ స్తంభించిపోయింది. ట్రాఫిక్ స్తంభించిపోవడంతో పోలీసులు జోక్యం చేసుకొని వారికి సముదాయించిన వినలేదు. దింతో ఇరువురికి మధ్య తోపులాట జరిగింది.

ప్రతి ఉద్యోగిని ఒకే విధంగా పరిగణించాలి

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పోలీస్‌శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగిని ఒకే విధంగా పరిగణించాలని, ఏఆర్, సివిల్, బెటాలియన్ పేరిట విడదీసి ఉద్యోగులతో ఆడుకోవద్దని పేర్కొన్నారు. ఈ పోలీస్‌శాఖలో పనిచేసేవారంతా ఏక్ పోలీస్ పరిగణించబడాలని విజ్ఞప్తి చేశారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కనీసం ఒక్కో జిల్లాలో మూడు నుంచి ఐదేండ్ల పాటు పనిచేసేలా వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేశారు. మిగితా కానిస్టేబుళ్ల మాదిరిగానే తమకు సెలవులు, బదిలీలు ఉండే విధానాన్ని తీసుకురావాలన్నారు. యేడాదిలో మూడేసి పోలీస్ స్టేషన్లు తిరగాల్సి రావడంతో కుటుంబాలకు దూరంగా ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీస్ అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

- నిర్మల్ ఎస్పీ డా.జి.జానకి షర్మిల



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పోలీస్ అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల అన్నారు. శనివారం నిర్మల్ పట్టణంలో జిల్లా పోలీస్ ప్రధాన కార్యలయంలోని అమరవీరుల స్థూపం వద్ద నుంచి ప్రారంభమై మంచిర్యాల ఎక్స్‌రోడ్ నుంచి ఎస్పీ క్యాంపు కార్యాలయం, బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా నుంచి తిరిగి అమరవీరుల స్థూపం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా రక్షణలో శాంతిభద్రతల పరిరక్షణలో నిబద్ధతతో విధి నిర్వహణ చేస్తూ, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా దేశ సైనికుల్లగా ముందుకు సాగుతున్న పోలీసుల కృషి అభినందనీయమని, ప్రజా క్షేమం కోసం పని చేస్తూ అమరులైన వారి త్యాగాలను స్మరించుకునేలా ప్రతి సంవత్సరం పోలీస్ ఫ్లాగ్‌డే నిర్వహిస్తున్నామన్నారు. అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని, ప్రజలతో మరింత మమేకం అవుతూ వారి మన్ననలను పొందేలా విధులు నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు స్మరిస్తూ వారి ఆశయ సాధన కోసం సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు తన స్వీయ రక్షణతో పాటు తన కుటుంబ క్షేమం కోసం హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. వాహనదారులు చేసే చిన్న చిన్న తప్పిదాల వాళ్ల జరిగే రోడ్డు ప్రమాదాల కారణంగా వాహనదారులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తమవంతు బాధ్యత గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో అధికంగా తలకు గాయం కావడం వలన వాహనదారులు మరణించడం జరుగుతోందని, ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పని సరిగా ధరించి వాహనం నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవినాష్ కుమార్, సీఐలు గోపినాథ్, సైలు, నవీన్ కుమార్, ప్రవీణ్ కుమార్, ప్రేమ్ కుమార్, మల్లేష్, రామకృష్ణ, రవీందర్, ఆర్ఐలు రామ్ నిరంజరావు, శేఖర్, రమేష్, ఎస్ఐలు శ్రీనివాస్, శంకర్, అశోక్, గణేష్, లింబాద్రి, రాహుల్, రమేష్, భాస్కర్ చారి, సాగర్‌రెడ్డి, సాయికుమార్, రాజేశ్వర్ గౌడ్, హనుమండ్లు, శ్రీకాంత్, సుమలత, జ్యోతి, మణి, సుమాంజలి, ఆర్ఎస్సైలు, వినోద్, రవి కుమార్, సాయికృష్ణ, రాజాశేఖర్, ఏం.రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దు



నవతెలంగాణ-సారంగాపూర్

పెద్ద పులి సంచారం గురించి ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దని డివైఆరో నజీర్‌ఖాన్ అన్నారు. శనివారం అడెల్లి అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్స్, టైగర్ మానిటరింగ్, డ్రోన్ మానిటరింగ్, ఫుట్ పెట్రోలింగ్ సిబ్బంది అటవీ ప్రాంత, వ్యవసాయ క్షేత్రాల వెంబడి కూంబింగ్ నిర్వహించారని తెలిపారు. పెద్దపులికి సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదన్నారు. అడెల్లి తండా గ్రామంలో అవగాహన సమావేశం నిర్వహించి ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికావద్దని మనోధైర్యం కల్పించారు.

రాయిసెంటర్లను అభివృద్ధి చేస్తాం



నవతెలంగాణ-బోథ్

రాయిసెంటర్లను అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ అన్నారు. శనివారం పాట్నాపూర్, మేడిగూడ గ్రామంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దండారి ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వ ఆర్థిక సాయం పెంచే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలు, జీవన విధానం, ఐక్యత మానవ సంబంధాల పెరుగుదలకు దండారి ఉత్సవాలు సహకరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, మాజీ ఎంపీటీసీ కురుమ మహేందర్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేష్, నాయకులు బోజన్న, ఎండీ అబ్రరర్, ఆడే మోహన్, రహీముద్దీన్ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్ర నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని మీసేవ కేంద్రానికి వచ్చే వినియోగదారుల నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ధరల కంటే ఎక్కువ డబ్బులు తీసుకుంటున్న మీసేవ కేంద్రం నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన యువకులు శనివారం తహసీల్దార్ లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని మీసేవ కేంద్రానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆధార్ అప్‌డేట్, పుట్టిన తేదీ చేర్చడం, నూతన ఆధార్ కార్డు, జనన మరణాలు నమోదుతో పాటు అనేక రకాల సర్టిఫికెట్ల కోసం ఆధార్ కేంద్రానికి రావడం జరుగుతుందని అన్నారు. ముఖ్యంగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి వచ్చే అమాయక ప్రజల దగ్గర ప్రభుత్వం నిర్దేశించిన ధరలకంటే అధికంగా రూ.150 నుంచి రూ.2వందల వరకు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. ఎన్నో సందర్భాల్లో మీసేవ నిర్వాహకుడిని అడిగినప్పటికీ మాకు అనేక రకాల ఖర్చులుంటాయని సమాధానం ఇచ్చేవాడని అన్నారు. ఎవరికి ఫిర్యాదు చేసుకుంటారో చేసుకోండనే విధంగా మాట్లాడారని తెలిపారు. తహసీల్దార్ ఏలాంటి చర్యలు తీసుకోనట్లయితే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. తహసీల్దార్ స్పందించి ప్రభుత్వం నిర్దేశించిన ధరల ప్రకారమే చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో రాము, అశోక్, రాజు, రాకేష్, కళ్యాణ్, లింగన్న, రజినీ, పలువురు యువకులు ఉన్నారు.

ఎల్ఆర్ఎస్‌ను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకోవాలి



నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న ప్లాట్ల యజమానులు ఎల్ఆర్ఎస్‌ను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకోవాలని ఎంపీడీఓ సునీత అన్నారు. శనివారం ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్ గ్రామ శివారులోని ప్లాట్‌లను ఆమె సందర్శించారు. గతంలో ఎల్ఆర్ఎస్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు ఇప్పుడు వాటిని అప్‌డేట్ చేసుకోవాలని అన్నారు. ఖానాపూర్ మండలంలోని మొత్తం 1,648 దరఖాస్తులు రాగా ఇందులో కేవలం మస్కాపూర్ గ్రామంలో 1,527 అప్లికేషన్‌లు వచ్చాయని అన్నారు. ఎల్ఆర్ఎస్‌ను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసుకున్న వారికి భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని సూచించారు. ఎల్ఆర్ఎస్ ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నా యజమానులకు గ్రామపంచాయతీ కార్యదర్శి కల్పన ఫోన్ ద్వారా సమాచారం అందిస్తున్నారని అన్నారు. ఇందులో ఎంపీఓ రత్నాకర్‌రావు, ఏఈఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

గ్రంథాలయం నిర్వహణపై ఉపాధ్యాయులకు శిక్షణ



నవతెలంగాణ-నిర్మల్

జిల్లా విద్యాశాఖ, రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని 19 పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఆదర్శ గ్రంథాలయ ఉపాధ్యాయులకు గ్రంథాలయ నిర్వహణపై ఒకరోజు శిక్షణ ఇచ్చారు.ఈ శిక్షణలో భాగంగా డీఈఓ రవీందర్‌రెడ్డి మాట్లాడారు. ఒక్కో గ్రంథాలయంలో 700 పుస్తకాలు, పుస్తకాలు భద్రపరచడానికి అల్మరాలు, విద్యార్థులు చదువుకోవడానికి టేబుల్స్ ఇతర అన్ని రకాల సౌకర్యాలు కల్పించారని అన్నారు. వీటిని వినియోగించుకొని విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలని కోరారు. ఆయా పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని, ప్రతి రోజూ గ్రంథాలయ పీరియడ్ తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులు చదువుతున్న పుస్తకాల వివరాలను రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని కోరారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నర్సయ్య మాట్లాడుతూ ప్రతీ తరగతికి, ప్రతి రోజూ గ్రంథాలయ పీరియడ్‌ను నిర్వహించాలని, విద్యార్థుల స్థాయిల వారీగా విభజించిన పుస్తకాలున్నాయని అన్నారు. ఆయా పుస్తకాలను వినియోగించుకొని పఠన నైపుణ్యాలు పెంచుకోవాలని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో రూమ్ టు రీడ్ ఇండియా సంస్థ జిల్లా ఇన్‌చార్జి గోనె రవి, ప్లానింగ్ కోఆర్డినేటర్ రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి వినోద్ కుమార్, పరీక్షల విభాగం ఇన్‌చార్జి భానుమూర్తి, వివిధ మండలాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, రూమ్ టు రీడ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని శాంతినగర్ కాలనీకి చెందిన మోరపాక దావీద్ అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకులు బిరుదుల లాజర్ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-బోథ్

మండలంలోని వజ్జర్ గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ గంగారాం గుండె పోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న డీఆర్డీఓ సాయన్న శనివారం బాధిత కుటుంబానికి రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట అధికారులు ఏపీడీ కృష్ణారావు, హెచ్‌ఆర్ రషీద్, ఏపీఓ ఉన్నారు.

ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ఇచ్చోడ

ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 31న మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించుకోవాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి కళ్లెపెళ్లి గంగయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఏఐటీయూసీ జెండా గద్దె వద్ద విలేకరులతో మాట్లాడుతూ భారతదేశంలో అతి పెద్ద కార్మిక సంఘంలో ప్రధానమైన అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, ఏఐటీయూసీ 1920లో అక్టోబర్ 31న ఆవిర్భావించినట్లు తెలిపారు. ఆనాడు స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు లలా లజపతి రాయ్ అధ్యక్షతన మొదటి మహాసభ ముంబైలో జరిగిందన్నారు. కార్మికులు, కర్షకులు, శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో యూగేందర్, లక్ష్మణ్, ఆయుబ్ ఖాన్ పాల్గొన్నారు.

వీసీని కలిసిన విద్యార్థులు

నవతెలంగాణ-ముథోల్

బాసర ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్‌ను శనివారం ట్రిపుల్ ఐటీ తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ (టిఎస్ఎఎస్) ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా వీసీని సన్మానించారు. ట్రిపుల్ ఐటీలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని వీసీని కోరారు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వీసీ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ విద్యార్థి సంఘం అండగా ఉంటుందని వారు పేర్కొన్నారు. సమస్యలను వీసీ పరిష్కారం చేస్తాడని వారు ఆశ భావాన్ని వ్యక్తం చేశారు. వీసీకి ఉన్నా అనుభవంతో ట్రిపుల్ ఐటీ అభివృద్ధి జరుగుతుందని తాము నమ్ముతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎఎస్ అధ్యక్షుడు ఆకాష్ యాదవ్, ప్రధాన కార్యదర్శ యశ్వంత్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఖాలిక్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

నవతెలంగాణ-ఇచ్చోడ

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మను దహనానికి నిరసనగా శనివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రయత్నించారు. కాగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ సందర్భంలో రైతుల పక్షాన నిలబడి పోరాడితే కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేయడం ఏంటి అని కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయలేదన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తే పోలీసులు అడ్డుకోవడం బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతమ్ రెడ్డి, ముక్రా (కె)మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, మహేందర్ రెడ్డి, రమేష్, జి.గణేష్, అరుగుల గణేష్ పాల్గొన్నారు.

పద్మశ్రీ కనక రాజు మృతికి టీఏజీఎస్ సంతాపం

నవతెలంగాణ-నిర్మల్

పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆదివాసీ సంస్కృతిని కాపాడేందుకు విశేష కృషి, సేవలు అందించిన తన గుస్సాడి బృందంతో ప్రపంచ వేదికలపై ఆదివాసీ సంస్కృతి విశిష్టను చాటిన పద్మశ్రీ కనక రాజు మృతికి తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సంతాపం తెలియజేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షులు దుప్పి సిదార్థ, జిల్లా కార్యదర్శి తొడసం శంభు శనివారం తెలిపారు. ఆయన మరణం ఆదివాసీ సమాజానికి, సాంస్కృతిక ఉద్యమాల పరిరక్షణకు తీరని లోటు అని తెలిపారు. పద్మశ్రీ గుస్సాడి కనక రాజు ఆదివాసీ సంస్కృతి పరిరక్షణ కు విశిష్ట సేవలను అందించారని అన్నారు. ఆసిఫాబాద్ కుమురంభీం జిల్లా జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో మారుమూల గ్రామంలో పుట్టి, తన ఆదివాసీ సమాజ పురాతన సంస్కృతి గుస్సాడిని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాఢా సానుభూతిని ప్రకటిస్తున్నామని వెల్లడించారు.

నిర్మల్‌టౌన్ : ఆదివాసీల జానపద గుస్సాడి నృత్యానికి వన్నె తెచ్చిన గుస్సాడి కనక రాజు ఆకస్మిక మరణం అత్యంత బాధాకరమని నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు కుచాడి శ్రీహరిరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుస్సాడీ కళాకారుడిని కోల్పోవటం తెలంగాణ ప్రాంతానికి, అందులో ఉమ్మడి ఆదిలాబాద్ ప్రజనీకానికి తీరని లోటని తీవ్ర దిగ్భ్రాంతం వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ జిల్లా మర్లవాయి గ్రామానికి చెందిన కనక రాజు ఆదివాసీల గుస్సాడి నృత్యానికి దేశవ్యాప్త ప్రఖ్యాతి తీసుకువచ్చారని తెలిపారు. ఎర్రకోటపైన తన నృత్యాన్ని ప్రదర్శించినందుకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు అందించారని గుర్తు చేశారు. అయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-నేరడిగొండ

సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సద్దాం అన్నారు. శనివారం మండలంలోని కుంటాల ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమున్న వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓ రవీందర్, ఆశ్రమ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విరోచనాలతో విద్యార్థిని మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



విరోచనాలతో బాధపడుతూ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థిని మృతి చెందిన సంఘటన శనివారం మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వాల్గొండ గ్రామానికి చెందిన మడావి కృష్ణ కుమార్తె గంగోత్రి ఇంద్రవెల్లిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. కాగా విద్యార్థిని మడావి గంగోత్రి(14) శుక్రవారం రాత్రి విరోచనాలు అయ్యాయి. పాఠశాలలో రాత్రి ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్ అందుబాటులో లేరు. ఏఎన్ఎం మాత్రలను ఇచ్చారు. అయిన విరోచనాలు తగ్గలేదు రాత్రంతా విరోచనాలతో బాధపడింది. తీవ్ర అస్వస్థతకు గురైనట్టు గుర్తించిన సిబ్బంది శనివారం ఉదయం రిమ్స్ ఆస్పత్రి తరలించారు. అప్పటికే విద్యార్థిని మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

విద్యార్థిని మృతిపై ఆదివాసీ సంఘాల ఆందోళన..

విద్యార్థిని మృతిపై ఆదివాసీ సంఘాల నాయకులు తీవ్ర ఆందోళన చేపట్టారు. ఆశ్రమాల్లో చదివే విద్యార్థులకు రక్షణ లేకుండా పోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బంది అందుబాటులో ఉండి రాత్రి ఆస్పత్రికి తీసుకెళితే విద్యార్థిని బతికి ఉండేదని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు మృతదేహంతో నిరసన తెలుపాలని నిర్ణయించుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని అధికారులకు సమాచారం అందించడంతో ఏటీడబ్ల్యూఓ క్రాంతికుమార్ మృతురాలి కుటుంబానికి రూ.2లక్షలు ఎక్స్‌గ్రెషియా ఇస్తామని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. పోలీసులు భద్రతతో రిమ్స్ నుంచి విద్యార్థిని మృతదేహాన్ని మండల కేంద్రం మీదుగా తీసుకెళ్లకుండా, ముత్నూర్ మీదుగా వాల్గొండకు తరలించారు.

కుమురంభీం విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని మరపగూడ గ్రామపంచాయతీ, జైనూర్ మండలంలోని పాట్నాపూర్ గ్రామ సమీపంలో శనివారం కుమురంభీం విగ్రహ ఆవిష్కరణను కుమురంభీం మనమడు కుమురం సోనేరావు, మాజీ జడ్పీ చెర్మెన్ రాథోడ్ జనార్ధన్ ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. జల్, జంగల్, జమీన్, ఆదివాసీ హక్కుల కోసం కుమురంభీం ఎనలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చెర్మెన్ తొడసం నాగోరావ్, ఉట్నూర్ మాజీ జెడ్పీటీసీ చారులత, రాయిసెంటర్ ఉమ్మడి జిల్లా సార్మెడి మెస్రం దుర్గుపటేల్, సర్పంచుల సంఘం మాజీ మండలాధ్యక్షుడు. ఊర్వేత రూప్‌దేవ్, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్, మెస్రం బదు పటేల్, ఏఎస్పి మండల అధ్యక్షుడు పూసం ఇశ్రు, ఇంగ్లే కేశవ్, మెస్రం శేఖర్ బాబు, పెందోర్ లచ్చు, కుంరా రాహుల్, మెస్రం మాణిక్ రావ్, తొడసం గజనాథ్, పూసం ఇశ్రు పటేల్, చాలుర్కర్ జనార్ధన్ పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

నవతెలంగాణ-బోథ్



మండలంలోని సాకేర గ్రామంలోని పశువులకు శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశుమిత్రలు మాట్లాడారు. వర్ష కాలంలో పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం ప్రతి గ్రామంలోని పశువులకు వేసే టీకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యశాఖ గోపాల మిత్రలు బాలాజీ, మహేందర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

నవతెలంగాణ-కౌటాల



మధ్యాహ్న భోజనం విద్యార్థులకు మెనూ ప్రకారం పెట్టాలని మండల విద్యాధికారి గావుడే హనుమంతు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్న భోజన కార్మికులు తమ పిల్లలుగా భావించి మీ ఇంటిలో ఎలాంటి రుచికరమైన భోజనాన్ని తయారు చేసుకుంటారో అదేవిధంగా ఇక్కడ కూడా మెనూ ప్రకారం రుచికరమైన భోజనం వండి విద్యార్థులకు పెట్టాలని సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పీజీహెచ్‌ఎంలు నారాయణ సింగ్, నానాజీ ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకున్న ఫూలే సేవా సమితి

నవతెలంగాణ-రెబ్బెన



అనారోగ్యంతో మండలంలోని కొండపల్లి గ్రామానికి చెందిన గుర్లె శాలిక్‌రావు నాలుగు రోజుల క్రితం చనిపోయాడు. విషయం తెలుసుకున్న పూలే సేవా సమితి సభ్యులు బాదిత కుటుంబానికి రూ. 31862 ఆర్థిక సాయాన్ని అందించారు. సమితి జిల్లా అధ్యక్షుడు మోర్లె తిరుపతి చొరవతో ఆర్థిక సాయం అందించి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుని భార్య లలిత, శిరీష, శ్రీకాంత్ పిల్లలు ఉన్నారు. ఆ కుటుంబానికి నగదుతో పాటు 75కిలోల బియ్యం అందించినట్టు అధ్యక్షుడు తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో పూలే సేవ సమితి సభ్యులు నికోడే అర్జున్ బాపురావు గుర్లె శ్రీనివాస్ మొర్లె, పాండురంగ్, లెండుగురే తిరుపతి, వశాక శంకర్, పోశం, మాజీ ఎంపీటీసీ మోర్లె రఘుపతి పాల్గొన్నారు.

ముగ్గురు యువకుల గల్లంతు

- సరదా కోసం ప్రాణహిత నదికి వెళ్లిన స్నేహితులు
- స్నానం చేస్తుండగా ఘటన..కొనసాగుతున్న గాలింపు చర్యలు



ఘటన స్థలంలో అధికారులు, స్థానికులు



ఇర్షద్



జహీర్



మోహిజ్

నవతెలంగాణ-బెజ్జూర్

ప్రాణహితలో ముగ్గురు గల్లంతైన ఘటన మండలంలోని సోమిని గ్రామ సమీపంలోని ప్రాణహిత నది వద్ద చోటు చేసుకుంది. శనివారం మార్కెట్‌లో వారంతపు సెలవు కావడంతో బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన జహీర్ హుస్సేన్, మోయిజ్, ఇర్షద్‌లు సోమిని సమీపంలోని ప్రాణహిత నది ఎర్రబండ రేవుకు మరో స్నేహితుడు ఖాజీంతో కలిసి వెళ్లారు. వీరు నదిలో స్నానం చేస్తున్నారు. అప్పటికే ఖాసీం ఒడ్డుకు వచ్చేశాడు. ఇదే క్రమంలో మడుగు ఉన్న చోటకు ఇర్షద్ వెళ్లి చేతులు కాళ్ల ఆడించడంతో జహీర్, మోయిజ్‌లు కూడా అతని దగ్గరికి వెళ్లారు. కొద్దిసేపటికే ఈ ముగ్గురు గల్లంతయ్యారు. ఒడ్డు మీద నుంచి స్నేహితులు మునిగి పోతున్నా ఈత రాకపోవడంతో ఏమీ చేయలేని పరిస్థితిలో ఖాజీం ఉండిపోయారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుటుంబ సభ్యులతో పాటు ఆర్‌ఐ సంతోష్, ఎస్సై విక్రమ్ ఘటన స్థలానికి చేరుకొని గల్లంతైన వారి కోసం పడవల ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. కాగా మోయిజ్ సెల్‌ఫోన్ షాపులో పని చేస్తున్నాడు. జహీర్ చెప్పుల షాప్‌లో తన తండ్రితో కలిసి పని చేస్తున్నాడు. ఇర్షద్ తన తండ్రితో కలిసి చిన్నచిన్న పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నాడు. ఘటన స్థలం వద్ద కుటుంబీకుల రోదనలు చూసి పలువురు కంటతడి పెట్టారు. స్నేహితులు తన కండ్ల ఎదుటే నదిలో గల్లంతు కావడం వారిని తాను కాపాడలేకపోయానని ఖాజీం విలపించారు. అప్పటికే గ్రామానికి చెందిన పలువురు ఆ మడుగు గురించి చెప్పినా వినపించుకోకుండా వెళ్లారని చెప్పాడు. సరాద కోసం వచ్చిన వీరు గల్లంతై విషాదం మిగులుస్తారని అనుకోలేదని చెబుతూ విలపించాడు. కాగా గల్లంతైన మోయిజ్, ఇర్షాద్‌లు అన్నదమ్ముల కొడుకులు కావడంతో వారి కుటుంబంలో విషాదాన్ని నింపింది. ఇదే మడుగులో గతంలో పలువురు గల్లంతైన సందర్భాలున్నాయని స్థానికులు చెబుతున్నారు. కాగా సంఘట స్థలంలో మాజీ జడ్పీటీసీ పుష్పలత భిక్షమయ్యా, మాజీ కోఆప్షన్ సభ్యుడు బషరత్ ఖాన్, మాజీ ఎంపీటీసీలు శ్రీనివాస్, ఆత్రం సాయిలు, వార్డు మెంబర్ షౌకాత్ అలీ పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఇదిలా ఉంటే ప్రతి ఏటా అక్టోబర్ చివరిలో ప్రాణహితకు బలి ఇవ్వడం అనావాయితీగా వస్తోంది. మొక్కుల సమయంలో వీరు వెళ్లి గల్లంతు కావడంతో గ్రామస్తులు చర్చింకుంటున్నారు.

గ్రామాలకు రోడ్డు సౌకర్యానికి కృషి

- ఎమ్మెల్సీ దండే విఠల్



నవతెలంగాణ-కౌటాల

గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కల్పించేల తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. రోడ్డు మరమ్మత్తుల పనులు ఎమ్మెల్సీ దండె విఠల్ శనివారం ప్రారంభించారు . మండలం కేంద్రం నుండి విర్దండి వరకు రోడ్డు మరమత్తులు కోసం గతం లో ఇచ్చిన హామీ నేడు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ నెరవేర్చారు. ఏసీడిపి నిధుల నుండి రహదారి మరమ్మత్తుల కోసం మంజూరు చేసి పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి మాజీ ఎంపీపీ లు బసర్కర్ విశ్వనాథ్ డుబ్బుల నానయ్య టిపిసిసి సభ్యులు అర్షద్ హుస్సేన్ రాచకొండ శ్రీవర్ధన్ ఉమా మహేష్ రేణుకుంట్ల పెంటయ్య తిరుపతి ఎం డి మహీం అహ్మద్ శంకర్ నారాయణ రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి



నవతెలంగాణ-బెజ్జూర్

మండలం సలుగుపల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో శనివారం కాగజ్‌నగర్ టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ ఆధ్వర్యంలో ఎస్సై వెంకటేష్, పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.5200 నగదు, రెండు మోటార్ సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. ఇద్దరు చౌదరి చంద్రశేఖర్, రౌతు గంగాధర్‌ను విచారించగా 16 మంది పేకాట ఆడుతున్నారని తెలిపారు. చౌదరి.చంద్ర శేకర్, రౌత్. గంగాధర్, రాజన్న, గండే.తిరుపతి, వెంకన్న, గున్నాజీ, బోర్యాటే.గౌతం, నాయిని లక్ష్మాజీ, అడపా.తిరుపతి, రమేష్, రోహిత్, తిరుపతి, సంతోష్, శేకర్, మహేష్. ఎల్కరి. హనుమంతు నుండి పారిపోయారన్నారు. పేకాట ఆడుతున్న వారిపై కేసు నమోదు చేసినట్లు బెజ్జూర్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించామన్నారు. పేకాట, జూదం, గంజాయి తదితర ఆ సాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసులు రమేష్, మధు సిబ్బంది పాల్గొన్నారు.

అనార్‌పల్లి వాగుపై తాత్కాలిక వంతెన ఏర్పాటు



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని అనార్‌పల్లి, కరంజి వాడ గ్రామాల మధ్యగల పెద్దవాగుపై శనివారం శివాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ నాయక్ ఆధ్వర్యంలో తాత్కాలిక వంతెన నిర్మాణం చేపట్టారు. నీటి ప్రవాహం కారణంగా మూడు నెలలుగా వాగు అవతలి వైపు గ్రామాల నుంచి వాహనాలు మండల కేంద్రానికి రాలేక తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. నీటి ప్రవాహం అధికంగా ఉండడం వల్ల ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. ప్రస్తుతం నీటి ప్రవాహం తగ్గడంతో సేవాలాల్ సేన కమిటీ సభ్యులు చొరవ తీసుకున్నారు. ట్రాక్టర్లను సమకూర్చి, పొక్లెయిన్ సాయంతో తాత్కాలిక దారి ఏర్పాటు చేశారు. దీంతో ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలు రాకపోకలకు సమస్య తీరింది. పత్తి ఇతర పంటలను వాహనాల్లో తరలించేందుకు మార్గం సుగమం కావడంతో కరంజి వాడ, బోరిలాల్ గూడ, జన్కాపూర్, అందుగూడ, పెద్ద కరంజి వాడ, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక వంతెన ఏర్పాటుకు కృషి చేసిన వారిలో సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు రాథోడ్ రమేష్, కరంజవాడ మాజీ సర్పంచ్ గోవింద్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇనూస్, వ్యాపారి ఏజాస్, ధర్మ ఉన్నారు.

బుద్ధుని బోధనలు ప్రపంచానికి ఆదర్శం



నవతెలంగాణ-వాంకిడి

గౌతమ బుద్ధుని బోధనలు ప్రపంచానికి ఆదర్శమని బౌద్ధ మహాసభ, బుద్ధిష్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు మహల్కార్ అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జశ్వంత్ బుద్ధవిహార్‌లో నిర్వహించిన వర్షావాస్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై అంబేద్కర్, గౌతమ బుద్ధుని చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోనే కాకుండా జిల్లావ్యాప్తంగా మూడు నెలల పాటు గౌతమ బుద్ధుని జీవిత చరిత్రపై గ్రంథపఠనం నిర్వహించడం అభినందనీయమన్నారు. బుద్ధుడు అంటే జ్ఞాని, సంపూర్ణ జ్ఞానం కలిగిన వ్యక్తి అంటారని అన్నారు. అలాంటి బుద్ధుని మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వర్షావాస్ ముగింపు సందర్భంగా అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ వారు సంఘం, శరణం, గచ్ఛామి, అనే నాటికను ప్రదర్శించారు. కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, మండలాధ్యక్షుడు జయరాం, ప్రధాన కార్యదర్శి దుర్గె సునీల్‌కుమార్, నాయకులు ప్రశాంత్, సందీప్, విలాస్, ప్రసాద్, అరుణ్, రమాబాయ్, మహిళా మండలి సభ్యులు, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

కనక రాజు..నీ యాది మరువనిది..

- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- ప్రముఖుల ప్రగాఢ సంతాపం
- అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు



కనక రాజు భౌతికకాయానికి పులమాలతో నివాళి అర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గుస్సాడీ నృత్యానికి గుర్తింపు తేవడమే కాకుండా ఆదివాసీ తెగల సంస్కృతి సాంప్రదాయాలను దేశంలో ప్రతి వ్యక్తికి తెలిసేలా చేసిన మహనీయుడు పద్మశ్రీ కనకరాజుని యాది జిల్లా మరిచిపోలేదు. గిరిజన తెగలు ఎక్కువగా నివాసం ఉండే జిల్లాలో వారి జీవన విధానంలో ఒకటైన గుస్సాడి ప్రాముఖ్యత ఎంతో ఉంటుంది. అటువంటి నృత్యాన్ని అందరికీ తెలిసేలా చేసి గిరిజనుల ఖ్యాతిని దశదిశల చాటిన 94 సంవత్సరాల కనకరాజు శుక్రవారం పరమపదించడంతో శనివారం ప్రభుత్వ లాంఛనాలతో ఆయన స్వగ్రామం జైనూరు మండలం మర్లవాయిలో అంత్యక్రియలు నిర్వహించారు.

అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో అధికారిక లాంచనాల మధ్య కనకరాజు అంత్యక్రియలు జిల్లా అధికారులు నిర్వహించారు. ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలతో అంత్యక్రియల కార్యక్రమాన్ని పూర్తి చేసినంతరం గాలిలోకి పోలీసులు కాల్పులు జరిపి ఆయనకు నివాళులర్పించారు.

ప్రముఖుల ప్రగాఢ సంతాపం

పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు మరణ వార్త తెలియడంతో ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా కనకరాజుతో తనకున్న అనుబంధాన్ని గిరిజన సాంప్రదాయాన్ని తెలియజేస్తూ సంతాపం ప్రకటించగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ ప్రకటన విడుదల చేశారు.

అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు

మార్లవాయిలో నిర్వహించిన కనకరాజు అంతిమయాత్రలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, జిల్లా ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు, ఆసిఫాబాద్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, వెడ్మ బొజ్జు, ఆర్డీఓ లోకేశ్వరరావు, డీఆర్డీఓ దత్తారం, కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా నాయకురాలు సరస్వతితో పాటు ఇతర అధికారులు ప్రజాప్రతినిధులు, ఆదివాసీ నాయకులు పాల్గొని ఆయనకు నివాళులర్పించారు.

కనకరాజు పార్థివదేహానికి సీపీఐ(ఎం) కమిటీ నివాళి

పద్మశ్రీ అవార్డు గ్రహీత కనకరాజు పార్థివదేహానికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు మార్లవాయిలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశ్రీ అవార్డు గ్రహీత ఆదివాసీ సంస్కృతిని కాపాడేందుకు విశేష కృషి, సేవలు అందించిన తన గుస్సాడి బృందంతో ప్రపంచ వేదికలపై ఆదివాసీ సంస్కృతి విశిష్టను చాటిన గొప్ప వ్యక్తి పద్మశ్రీ కనకరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ కార్యదర్శి కుశాన రాజన్న, కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు కోట శ్రీనివాస్, రాజేందర్, టీఏజీఎస్ జిల్లా అధ్యక్షురాలు కోరంగ మాలశ్రీ పాల్గొన్నారు.

జిల్లా కార్యాలయంలో..

జిల్లా కార్యాలయంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కనకరాజు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి సేవలను స్మరిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షురాలు కోరెంగ మలశ్రీ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికనంద్, జిల్లా ఉపాధ్యక్షులు నిఖిల్, కేవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీఏజీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి నైతం రాజు పాల్గొన్నారు.



కనకరాజు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ఎంపీడీఓగా ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-వాంకిడి



మండల నూతన ఎంపీడీఓగా వీ.ప్రవీణ్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ బదిలీ కాగా ఆయన స్థానంలో సిర్పూర్(యు) ఎంపీడీఓగా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్ వాంకిడికి వచ్చారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కార్యాలయ సిబ్బంది అతనికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని పట్టభద్రులు ఓటర్ నమోదును చేసుకోవాలని బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్ అన్నారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేయనున్న ఆల్ ఫోర్స్ సంస్థల అధినేత నరేందర్ రెడ్డి మద్దతుగా బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం వాంకిడి మండలం ఆశ్రమ పాఠశాలలో ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న పట్టభద్రుడు పూర్తిస్థాయిలో ఓటర్ నమోదు చేసుకోవాలని రానున్న ఎన్నికల్లో నిరుద్యోగులకు అండగా ఉంటూ ఉద్యోగుల సమస్యల పట్ల పోరాటం చేసే ఉత్తమ నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు. ఓటర్ నమోదు కోసం ఫోన్ నెంబర్ 9440070884, 9010785499ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బొట్టుపల్లి సాయికృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు మాడుగుల నారాయణమూర్తి, మడావి రమేష్ పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ



నవతెలంగాణ-చింతలమానేపల్లి

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో కౌటాల సీఐ ముత్యం రమేష్, ఎస్సై ఇస్లావత్ నరేష్ పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా యువతకు రెండు వాలీబాల్ కిట్లను అందించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, ఈ ఆట వస్తువులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే యువత స్నేహ పూర్వ సత్సంబంధాలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, అంజి వాలీబాల్ యూత్ యువకులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి



కౌటాల : లైబ్రరీని ప్రారంభిస్తున్న ఎంఈఓ

నవతెలంగాణ-కౌటాల

విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి గావుడే హనుమంతు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రూం టు రీడ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన మోడల్ గ్రంథలయాన్ని శనివారం స్వచ్ఛంద సంస్థ జిల్లా అధికారి జెన్నిఫర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను తీర్చిదిద్దడంలో గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటారన్నారు. కార్యక్రమంలో పీజీహెచ్‌ఎం లు నారాయణ సింగ్, నానాజీ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సంపత్ ఉన్నారు.

బెజ్జూర్ : రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ ద్వారా మండలంలోని బారెగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో మోడల్ లైబ్రరీని ఏర్పాటు చేయగా ఎంఈఓ సునీత ప్రారంభించారు. పుస్తక పఠనం వల్ల పిల్లల్లో ఆలోచన, ఊహా శక్తి, కొత్త పదాలు తెలుసు కోవచ్చని ఎంఈఓ అన్నారు. లైబ్రేరిలో సుమారు 600 (తెలుగు, ఇంగ్లీష్)పుస్తకాలు, రీడింగ్, బీరువా, కార్పెట్స్, చిత్రాలు వేయడానికి సామాగ్రి అందచేశారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అరవింద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, సీఆర్పీలు సత్యనారాయణ, శ్రీవాణి, రూం టూ రీడ్ జిల్లా ఇన్‌చార్జి జెన్నిఫర్, మండల కోఆర్డినేటర్స్ పల్లె వెంకన్న, చంద్రదేఖర్, సంపత్, పద్మశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట శనివారం భవన నిర్మాణ కార్మికులు ధర్నా చేపట్టారు. 45 రోజులుగా కాగజ్‌నగర్‌తో పాటు పరిసర గ్రామాలకు ఇసుక రవాణ నిలిపివేయడంతో తాము తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామంటూ వారు ఆందోళన నిర్వహించారు. ఇసుక రవాణ లేకపోవడంతో భవన నిర్మాణ పనులు ఆగిపోయాయని, దీంతో తమ కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని వారు వాపోయారు. తమ సమస్యను పరిష్కరించి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



29న ఉమ్మడి జిల్లా పోటీలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉమ్మడి జిల్లా పాఠశాల క్రీడల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాలికలకు అండర్ 19 ఉమ్మడి జిల్లా స్థాయి నెట్ బాల్, ఖోఖో పోటీలు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారిణి కళ్యాణి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మహేష్ ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలో పాల్గొనేవారు ధ్రువీకరణ పత్రాలతో 29 ఉదయం 9 గంటలకు ఆదర్శ పాఠశాల పీడీ తిరుపతి లేదా 9949300668 సంప్రదించాలన్నారు.

ఆదివాసీ కొలవార్ రాష్ట్ర అధ్యక్షుడిగా బుర్స పోచయ్య

నవతెలంగాణ-బెజ్జూర్



ఆదివాసీ కొలవార్ (మన్నేర్‌వార్లు) సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బుర్స పోచయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలో జిల్లా, మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడిన కొలవార్‌లను సంఘటితం చేసి హక్కుల కోసం ఉద్యమిస్తామన్నారు. ఐక్యతతోనే హక్కుల సాధ్యమన్నారు. అనంతరం మా కులదైవం భీమన్న దేవుడికి పూలమాల వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డబ్బా బాబు, మండల కొలవార్ (మన్నేర్ వార్లు) సేవా సంఘం అధ్యక్షులు పెద్దల సంతోష్, యువజన అధ్యక్షులు మానేపల్లి వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు ఇట్టెల లలిత, సంఘం నాయకులు పాల్గొన్నారు.

పద్మశ్రీ కనక రాజు మృతికి టీఆర్‌జేకేఎస్ సంతాపం


నవతెలంగాణ-తాండూర్



తన గుస్సాడి బృందంతో ప్రపంచ వేదికలపై ఆదివాసీ సంస్కృతి విశిష్టను చాటిన పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు మృతికి తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కమిటీ సంతాపం తెలియజేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి హనుమాండ్ల మధుకర్ పద్మశ్రీ గుస్సాడి కనకరాజు పార్థివ దేహానికి నివాలు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మశ్రీ గుస్సాడి కనక రాజు ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకు విశిష్ట సేవలను అందించారని తెలిపారు. ఆదివాసీ సమాజ పురాతన సంస్కృతి గుస్సాడిని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప సాంస్కృతిక పరిరక్షణకు నిరంతరం కృషి చేశారని కొనియాడారు. వారి మరణం ఆదివాసీ సమాజానికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీరని లోటని అన్నారు. ఈ సందర్భంగా వారి కుటుంబానికి ప్రగాడా సానుభూతి తెలియా జెశారు.

గోదావరిలో మునిగి మత్స్యకారుడి మృతి

నవతెలంగాణ-దండేపల్లి





మండలంలోని కన్నెపల్లి గ్రామానికి చెందిన మగ్గిడి కిషోర్(35) మత్స్యకారుడు ప్రమాదవశాత్తు తెప్ప బోల్తా పడి గూడెం గోదావరిలో మునిగి మృతి చెందినట్లు దండేపల్లి ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మృతుడు కిషోర్ శుక్రవారం సాయంత్రం చేపల వేటకు వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్ళాడు. రాత్రి అయిన ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం ఉదయం కిషోర్ మృతదేహం గోదావరినదిలో కనిపించింది. మృతుని భార్య పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేతకాని కులానికి ప్రత్యేక కేటగిరి కేటాయించాలి



నవతెలంగాణ-జన్నారం

నేతకాని కులం ఏ కులానికి ఉపకులం కాదని, ఏబీసీడీ వర్గీకరణ చేస్తే, నేతకాని కులాన్ని డి కేటగిరీలో చేర్చాలని, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కేటాయించాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, దుర్గం రాజేష్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జాడి ముసలయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో ఏర్పాటుచేసిన నేతకాని మహర్ సంక్షేమ సంఘం మండల స్థాయి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో నేతకాని జనాభా 20 లక్షలకుపైగానే ఉందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేస్తే దానికి కట్టుబడి ఉన్నామన్నారు. మాల సోదరులు మా నేతకాని జనాభాను వారి ఖాతాలో వేసుకొని ఎక్కువగా రిజర్వేషన్లు పొందుతున్నారన్నారు. ఏ కులానికి ఆ కులానికె రిజర్వేషన్లు ప్రకటించాలన్నారు. నేతకాని కులస్తులంతా ఐక్యంగా పోరాటం చేసి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. ప్రతి మండల కమిటీలు, గ్రామ కమిటీలు వేసి నేతకాని ఉద్యమాన్ని ఉధృతం చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణతో పాటు 25 శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కుల గనన చేసి ఎస్సీలో ఉన్న అన్ని కులాల వారికి జనాభా ప్రకారం వాటాను సరి సమానంగా పెంచాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ నేతకాని మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు అనపర్తి యువరాజ్, రాష్ట్ర నాయకులు బోర్లకుంట ప్రభుదాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి రాజేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాడి గంగాధర్, మండల అధ్యక్షుడు రత్నం లక్ష్మణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి వెంకట్, ప్రధాన కార్యదర్శి రత్నం లక్ష్మణ్, సీనియర్ నాయకులు బండారి స్వామి, దుర్గం వినోద్, అల్లూరి వినోద్, జునుగురి మల్లయ్య, కె శ్రీనివాస్, శంకర్, దుర్గం వసంత్, గంగాధర్, రూబెన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా మహేందర్ రెడ్డిని గెలిపించాలి

నవతెలంగాణ-కాసిపేట

నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డిని ప్రథమ ప్రాతినిధ్య ఓటును వేసి గెలిపించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా గౌరవాధ్యక్షురాలు బండ శాంకరి కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూరిబా పాఠశాలలో పీఆర్టీయూటీఎస్ నాయకులు ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూటీఎస్ జిల్లా గౌరవాధ్యక్షురాలు బండ శాంకరి మాట్లాడుతూ టీచర్ల సమస్యల సాధన కోసం పీఆర్టీయూ అలుపెరుగని పోరాటం చేస్తుందన్నారు. సేవా భావం కలిగిన మహేందర్‌రెడ్డి గెలుపు బాటలో పయనిస్తున్నారని, మీ అమూల్యమైన ఓటును వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయుల కోసం అనేక జీఓలను సాధించడం జరిగిందని, మినిమం టైం స్కేల్, పీఆర్సీ, ప్రమోషన్స్, పెండింగ్ బిల్స్, డీఏలు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానంకై పోరాటం చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ మండల ప్రధాన కార్యదర్శి జ్యోతి, ఎలక్షన్ కోఆర్డినేటర్ తనుకు నాగేశ్వరరావు, జిల్లా నాయకులు అన్నం రమణారెడ్డి, పల్లె కృష్ణగోపాల్ రావు పాల్గొన్నారు.

వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మున్సిపాలిటీ పరిధిలోని ఎంజేపీ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని ఆర్‌సీఓ గోపీచంద్‌కు వినతి పత్రం అందజేశారు. శనివారం మండల కేంద్రానికి వచ్చిన ఆర్‌సీఓను కాంట్రాక్టు ఉపాధ్యాయులు దసరా సెలవులలో జీతాలు కట్ చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, దీన్ని పరిగణలోకి తీసుకొని వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దయాసాగర్, ప్రసన్నకుమార్, సత్యనారాయణ, రాజేష్, రమేష్, మహేందర్, స్రవంతి, శిరీష, శైలజ, వరలక్ష్మి, సురేందర్, వసంత, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి : ముగ్గురిపై కేసు

నవతెలంగాణ-జైపూర్

మండలంలోని ఇందారం గ్రామ శివారు శివ సాయి రైస్ మిల్ సమీపంలో పేకాట స్థావరంపై శనివారం జైపూర్ ఎస్ఐ శ్రీధర్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో దాడులు నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. శివ సాయి రైస్ మిల్ సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన నమ్మదగిన సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకుని రూ.23,270 నగదు స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడుతూ పట్టుబడిన వారిలో టేకుమట్ల గ్రామానికి చెందిన ఇద్దరు గోనె వసంత్ కుమార్, కొత్తపెల్లి కృష్ణ, ఇందారంకు చెందిన కామెర దుర్గయ్య నుండి మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా ఈ సంఘటనకు సంబంధించి మరో ఏడుగురు పరారైనట్లు తెలిపారు. పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందుతున్న వారి ఆర్థిక చెల్లింపులో జాప్యమెందుకు?

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి కార్మికులు, ఉద్యోగులకు సంబంధించి గత నెల రోజులుగా లాభాల వాట, దీపావళి బోనస్ చెల్లింపులు జరుపుతున్న యాజమాన్యం పదవీ విరమణ పొందుతున్న వారికి చెల్లించాల్సిన ఆర్థిక లావాదేవీల విషయంలో జాప్యం చేస్తోంది. సింగరేణి ఉద్యోగిగా పదవీ విరణ పొందిన కార్మికులు నెలల తరబడి పొందవల్సిన ఆర్థిక లావాదేవీల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితిపై యాజమాన్యం దృష్టి సారించాలని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు ఆళవందార్ వేణుమాద్ అన్నారు. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న సింగరేణి సంస్థ ప్రతి విభాగం కంప్యూటరీకరించిన తరువాత కూడా ఈ విధంగా జాప్యం ఎందుకు జరుగుతుందని ప్రశ్నించారు. సహ ఉద్యోగులకు చెల్లించిన తీరుగా అదే రోజున పదవీ విరమణ పొందిన వారికి కూడా బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పదవీ విరమణ పొందిన రోజున పెన్షన్, ప్రావిడెంట్ ఫండ్, గ్రాట్యూటీ నగదు పదవీ విరమణ పొందినప్పుడే చెల్లించాలని అన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-జన్నారం

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జన్నారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉమాశ్రీ అన్నారు. శనివారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు వివిధ వైద్య పరీక్షలు నిర్వహించారు. తక్కువ రక్తం ఉన్నవారికి ఐరన్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు రాంటెంకి శ్రీనివాస్ ఉన్నారు.

రోడ్డెక్కిన పోలీస్ కుటుంబాలు



నవతెలంగాణ-మంచిర్యాల

రాష్ట్రం అంత ఏక్ పోలీస్ విధానం అమలు చేయాలని కోరుతూ మంచిర్యాల జిల్లా గుడిపేట 13వ బెటాలియన్‌లో విధులు నిర్వహించే పోలీసులు వారి భార్యలతో కలిసి శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఫ్లై ఓవర్ జాతీయ రహదారిపై బైఠాయించి ప్ల కార్డులతో నిరసన తెలిపారు. రాష్ట్రం అంత ఒకే పోలీస్ విధానం ఉండాలని డిమాండ్ చేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని అన్నారు. 24 గంటలపాటు ఉద్యోగాలంటూ ఇండ్లకు రావడంలేదని, కనీసం మంచి చెడుల సమయంలో సైతం సెలవులు ఇవ్వడం లేదని పోలీసు భార్యలు కన్నీరు పెట్టుకున్నారు. ఒకే చోట ఉద్యోగం చేయకుండా రాష్ట్రమంతటా తిప్పుతున్నారని బెటాలియన్‌లో చెట్లు నాటిస్తూ, గడ్డి పీకిస్తూ పై అధికారులకు ఊడిగం చేపిస్తున్నారంటూ పలువురు కానిస్టేబుళ్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు రక్షణ కల్పించే పోలీసుల కుటుంబాలు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలుపుతున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సెలవుల విధానాన్ని మార్చాలని పని భారన్ని తగ్గించాలని నినదించారు. విధి నిర్వహణ పేరుతో కుటుంబ సభ్యులకు దూరం చేస్తున్నారని వాపోయారు. ఘటన స్థలానికి చేరుకున్న మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, మంచిర్యాల సీఐ ప్రమోద్ రావులు వారికీ నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

నవతెలంగాణ-కాసిపేట



రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఎస్ఎస్ఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.8200 కోట్లు స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్‌లో ఉన్నాయని, దీంతో పేద మధ్య తరగతి విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రయివేట్ కళాశాలలో చదువుకునే విద్యార్థులు చదువులు పూర్తి చేసుకొని పై చదువులు చదువుకోవడానికి వెళ్లాలంటే కొన్ని ప్రయివేట్ యాజమాన్యాలు ఫీజు రీయింబర్స్మెంట్ రాలేదని, అవి చెల్లించి సర్టిఫికెట్లు తీసుకోవాలని నిబంధనలు పెడుతున్నారని, దీంతో పేద విద్యార్థులు పైచదువులు చదువుకోలేక విద్యను మధ్యలో ఆపేసే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాసిపేట మండల కమిటీ ఎస్ఎఫ్ నాయకులు హర్షిత్, నవీన్, రాజేందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు ఆయిల్ ఫామ్ సాగుపై ఆసక్తి చూపాలి




నవతెలంగాణ-తాండూర్

రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా ఆయిల్ ఫామ్ సాగుపై ఆసక్తి చూపాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి కే అనిత సూచించారు బెల్లంపల్లి మండలం కన్నాల రైతు వేదికలో ఆయిల్ పామ్ సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఉద్యానవన శాఖ రాయితీలనందిస్తుందని తెలిపారు. మొక్కలతో పాటు రెండు సంవత్సరాల పాటు మెంటెనెన్స్ చార్జీలను అందిస్తుందని తెలిపారు. నీటి సదుపాయం గల రైతులు ఆయిల్ ఫామ్ తోటల సాగు చేసేందుకు ముందుకు రావాలని ప్రోత్సహించారు. సంవత్సరానికి ఎకరాకు రూ.లక్ష 50వేలు ఆదాయం వస్తుందని తెలిపారు. బెల్లంపల్లి వ్యవసాయా డివిజన్ సహాయ సంచాలకులు శ్రీ రాజ నరేందర్ మాట్లాడుతూ రైతులు మార్కెట్లో డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్, డ్రాగన్ ఫ్రూట్ వంటి ప్రత్యామ్నాయ పంటలను పండించాలని తెలిపారు. కొత్తగా ఆయిల్ పామ్ సాగు చేయాలనుకునే రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఉద్యానవన శాఖ అధికారి అర్చన, బెల్లంపల్లి వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్, కాసిపేట్ ఏఓ ప్రభాకర్, భీమిని క్లస్టర్ ఉద్యాన అధికారి అరుణ్. మార్కెటింగ్ ఫీల్డ్ ఆఫీసర్ రాము పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం కాసిపేట పోలీసుల ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సంధర్భగా విద్యార్థులకు కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ డ్రగ్స్ రహిత సమాజంపై అవగాహన కల్పించారు. ఈ మధ్యకాలంలో యువత డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిమాణాలను తెలియజేస్తూ, ఇవి మీ తల్లిదండ్రులకు మీ చుట్టుపక్కల వారికి కూడా తెలియజేయాలన్నారు. గంజాయి, డ్రగ్స్ కొనడం, అమ్మడం లేదా ఉపయోగం చేసేవారి వివరాలు తెలిస్తే వారి వివరాలను 1908 నెంబర్‌కు ఫోన్ చేసి లేదా నేరుగా మాకు తెలియ చేయాలని తెలిపారు. ఇలాంటి వారు మా దృష్టికి వస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మామిడిపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ విద్యార్థులంతా ఫోను, ధూమపానము, మద్యం లాంటి చెడు అలవాటులకు బానిసలు కావద్దని, మీ తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయవద్దని, సమాజం కోరుకునే మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్సీ అగ్గడి భాస్కర్ రచించిన వీర తెలంగాణ పౌరులారా అనే వీడియో పాటను విద్యార్థులకు చూపించి విద్యార్థులతో ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం మామిడిపల్లి సాంబమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో ఉద్యోగం సాధించిన రమాదేవి



నవతెలంగాణ-మందమర్రి

టీఎస్‌పీఎస్సీ గురుకులంలో 3వ జోన్‌కి చెందిన దారిపెల్లి రమాదేవి లక్సెట్టిపేట గురుకులంలో పీఈటీగా ఉద్యోగం సాధించారు. బిఎడ్ పూర్తి చేసిన రమాదేవి 2017లో సంక్షేమ గురుకుల పీఈటీ పోస్టుకు పరీక్షలు రాసింది. పోస్టుల భర్తీకి సంబంధించిన రాత పరీక్షలన్నీ అదే సంవత్సరం పూర్తయ్యాయి. కానీ, విద్యార్హతలు, సాంకేతిక కారణాలతో న్యాయ వివాదాలు తలెత్తాయి. దీనితో 2024 వరకు వివాదాలన్నింటినీ తెలంగాణ పబ్లిక్‌సర్వీస్ కమిషన్ ఒక్కొక్కటిగా పరిష్కరించింది. దీనితో 1:2 నిష్పత్తిలో మెరిట్ జాబితాను ప్రకటించింది. సర్టిఫికేట్ వెరిఫికేషన్ ముందే అభ్యర్థుల నుంచి సొసైటీల వారీగా ఆప్షన్లు తీసుకుంది. ఆ ఆప్షన్ల ప్రకారం మందమర్రికి చెందిన దారిపెల్లి రమాదేవి తండ్రి మల్లయ్య ఇటీవల ప్రకటించిన పీజీటీ ఫలితాల్లో ఎంపికై లక్సెట్టిపేట గురుకులంలో పిఈటిగా బుధవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. కొలువు సాధించడంతో రమాదేవి హర్షం వ్యక్తం చేసింది. రమాదేవి ని భర్త ప్రకాష్, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు స్థానికులు అభినందిస్తున్నారు.

సివిల్ జడ్జి క్వార్టర్ ప్రారంభం



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణ పరిధిలోని కన్నాల హైవే సమీపంలో నూతనంగా నిర్మించిన బెల్లంపల్లి సివిల్ జడ్జి క్వార్టర్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఈవీ వేణుగోపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి సివిల్ జడ్జి జె.ముఖేష్, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, అసిస్టెంట్ కలెక్టర్ మోతిలాల్, బెల్లంపల్లి ఏసీపీ ఏ రవికుమార్‌లతో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు పుష్పగుచ్చాలు అందించి, గుస్సాడీ నృత్యాలతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కోర్టు ప్రాంగణంలో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి జడ్జి నివాస గృహానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ, తహసీల్దార్ జోష్ణ, ఎంపీడీఓ మహేందర్, బెల్లంపల్లి రూరల్, మందమర్రి, తాండూర్ సీఐలు సయ్యద్ అఫ్జలొద్దీన్, శశిధర్ రెడ్డి, కుమారస్వామి, ఎస్ఐలు రమేష్, ప్రవీణ్, ప్రసాద్, ఆంజనేయులు పాల్గొన్నారు

ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగుల గొంతుకనవుతా : శేఖర్‌రావు

నవతెలంగాణ-జన్నారం

ఎమ్మెల్సీగా గెలిపిస్తే నిరుద్యోగుల సమస్యలతో పాటు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తానని మండలానికి చెందిన యాదగిరి శేఖర్‌రావు అన్నారు. కరీంనగర్, వరంగల్, నిజామాబాద్,ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటిచేస్తున్న ఆయన శనివారం ప్రచారంలో భాగంగా స్థానిక ప్రభుత్వ పాఠశాల, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులను కలిసి మాట్లాడారు. అనంతరం స్లేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడి నుంచి ఎమ్మెల్సీగా గెలిచిన వాళ్ల నిరుద్యోగులతో పాటు ప్రయివేట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైయ్యారని అన్నారు. ఇప్పటికే రిటైర్డయిన ఉద్యోగులకు రావలసిన బెనిఫిట్స్ రాలేదని వారికి సంబందించి సుమారు రూ.40 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయని తనను గెలిపిస్తే ఈ విషయాన్ని సీఎం, డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి వారికి బెనిఫిట్స్ అందేలా కృషిచేస్తానని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రయివేట్ ఉద్యోగులకు హెల్త్ కార్డులు, ఆరోగ్య భీమా లేదని దీని వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ప్రయివేట్ ఉద్యోగులందరికి గెలిచిన తర్వాత వారి సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని అన్నారు. ఈ సమావేశంలో ట్రస్మా జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మధుసూదన్, లక్ష్మీనారాయణ, మండల అధ్యక్షుడు సతీశ్‌గౌడ్, దండేపల్లి మండల ప్రధాన కార్యదర్శి రాజలింగయ్య, ఉపాధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పాఠశాల క్రీడా సామఖ్య(ఎసీఎఫ్) రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సీఈసీ విద్యార్థి పి.ప్రశాంత్ మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లోని ఠాగూర్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన అండర్-19 ఫుట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కాగా ఎనిమిదో తరగతి విద్యార్థి కే.రూపక్, మంచిర్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర)లో నిర్వహించిన అండర్-17 క్రికెట్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య పోటీలకు ఎంపికైన ప్రశాంత్, రూపక్‌లను ప్రిన్సిపల్ అబ్దుల్ ఖలీల్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎల్ఆర్ఎస్ చేసుకుంటేనే ప్లాట్లపై పూర్తి అధికారం

- మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు

నవతెలంగాణ-జైపూర్

ఇతరుల నుండి కొనుగోలు చేసినటువంటి ఇంటి స్థలాలను రెగ్యూలరైజ్ చేస్తే తప్పా సదరు ఇంటి స్థలాల కొనుగోలు, విక్రయాలు, ఇంటి నిర్మాణాలకు అనుమతి లభించదని మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపురావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీరామచంద్ర మిషన్‌లో గల ప్లాట్ల సర్వేను పరిశీలించిన ఆయన రామచంద్రమిషన్‌లో ఇప్పటి వరకు 80కి మించిన ప్లాంట్లకు సంబంధించిన అప్లికేషన్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వారు కూడా వెంటనే తమ వద్ద గల రికార్డులు తీసుకువచ్చి ఎల్ఆర్ఎస్ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఎల్ఆర్ఎస్ చేయకుండా ఉన్నటువంటి ప్లాంట్లు భవిష్యత్తులో అమ్ముకోవడం, సదరు ప్లాంట్‌లో భవన నిర్మాణం చేపట్టాలంటే అనుమతి లభించదని హెచ్చరించారు. వచ్చిన దరఖాస్తులను ఈ నెల 31 నాటికి పూర్తి చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ దాసరి అఖిల, కార్యదర్శి ఉదయ్ కుమార్, ప్లాంట్ యజమానులు ఉన్నారు.

అంధకారంలో అండర్ బ్రిడ్జి

నవతెలంగాణ-మంచిర్యాల

పట్టణంలోని అండర్ బ్రిడ్జ్ అంధకారంగ మారింది. రాత్రి వేళ చిమ్మ చీకటి కమ్మేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ రోడ్ నుంచి హమాలివాడ, రాజీవ్ నగర్‌కు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం రూ.10 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి నెల రోజులు గడుస్తున్నా అధికారుల నిర్లక్షంతో ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. దీంతో వాహన దారులు చీకటి మార్గం గుండానే రాక పోకలు కొనసాగించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెంట్రల్ లైటింగ్‌కు కనెక్షన్లు ఇస్తే వాహన దారులు, పాద చారుల రాక పోకలకు ఇబ్బందులు ఉండవని ప్రజలు కోరుతున్నారు.



ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఐఎన్‌టీయూసీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంఘం (327) జిల్లా కార్యదర్శి ఎమ్మాజి సతీష్ మాట్లాడుతూ సంఘం ఏర్పాటు చేసి 70 వసంతాలు పూర్తి చేసుకుందని, ఆవిర్భావం నుండి ఆలిండియా ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడిగా జి సంజీవరెడ్డి ఒక్కరే కొనసాగుతుండడం గర్వకారణమని అన్నారు. కార్మికుల హక్కుల పోరాటంలో తమ సంఘం ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్, కంపెనీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీదేవి, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంటికి కాంగ్రెస్ ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు శనివారం జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ ఇంటికి వెళ్లారు. మొదటిసారిగా వచ్చిన ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కోవలక్ష్మి ఇంటికి వెళ్లడంపై జిల్లాలో మార్పులు జరుగుతాయని పలువురు మాట్లాడుతున్న నేపథ్యంలో గతంలో ఉన్న అనుబంధంతోనే మర్యాదపూర్వకంగా కలిసామని ఇరువురు ఎమ్మెల్యేలు వెల్లడించారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మర్సుకోల సరస్వతి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-19 కబడ్డీ పోటీల్లో జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ యాదగిరి విద్యార్థిని అభినందించినంతరం మాట్లాడుతూ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి చుంచు వంశీకృష్ణ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు. నవంబర్ 2 నుండి 4 వరకు మహబూబ్ నగర్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొంటాడని వివరించారు. విద్యార్థుల క్రీడాభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విద్యార్థిని అభినందించిన వారిలో ఎస్వోపీ అబ్దుల్ రహీం, సంతోష్, పీడీ సట్ల శంకర్, పీఈటీ కోట యాదగిరి, హెచ్ఎం మేక సురేందర్, ఉపాధ్యాయుడు కోసరి మహేష్, ఉమ్మడి జిల్లా సెక్రెటరీ బాబురావు ఉన్నారు.

ఆదివాసీ సమాజానికి తీరని లోటు



నవతెలంగాణ-కెరమెరి

పద్మ శ్రీ అవార్డు గ్రహీత ఆదివాసీ సంస్కృతిని కాపాడేందుకు విశేష కృషి చేసి సేవలందించి తన గుస్సాడి బృందంతో ప్రపంచ వేదికలపై ఆదివాసీ సంస్కృతి విశిష్టను చాటిన పద్మశ్రీ కనక రాజు మృతికి సీపీఐ(ఎం) నాయకులు సంతాపం తెలియజేశారు. శనివారం మార్లవాయిలో ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, కోట శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయన మరణం ఆదివాసీ సమాజానికి, సంస్కృతిక ఉద్యమాల పరిరక్షణకు తీరని లోటని పేర్కొన్నారు. పద్మ శ్రీ గుస్సాడి కనక రాజు ఆదివాసీ సంస్కృతి పరిరక్షణకు విశిష్ట సేవలను అందించారని కొనియాడారు. జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో మారుమూల గ్రామంలో పుట్టి తన ఆదివాసీ సమాజ, పురాతన సంస్కృ' గుస్సాడి' ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప కళాకారుడన్నారు. కనక రాజు మరణం ఆదివాసీ సమాజానికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తీరని లోటని తెలిపారు. సీపీఐ(ఎం) జిల్లా నాయకులు రాజేందర్, మల్లాశ్రీ, రాజు, టికానంద్ ఉన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని శనివారం సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు బొమ్మెన సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పడి, ఏడు నెలలు గడుస్తున్నా, ఇప్పటి వరకు కూడా విద్యారంగంపై కనీసం సమీక్ష చేయలేదని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని లేని యెడల జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదు

నవతెలంగాణ-ఉట్నూర్

కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, భారత్ చౌహన్ అన్నారు. శనివారం ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 60 ఏండ్ల ఆకాంక్ష 14 ఏండ్ల ఉద్యమం చేసిన వందల మంది బలిదానం, లక్షల మంది పోరాటం, కోట్లాది మంది ఆరాటం సాధించుకున్న తెలంగాణ అన్నారు. పదేండ్ల అభివృద్ధి పథంలో నడిపిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. అడ్డగోలు 420 హామీలతో అధికారం దక్కించుకొని పది నెలల పాలనతో అన్ని వర్గాల ప్రజలను, రైతులను, మహిళలను వికలాంగులను, విద్యార్థులను ఆగం పట్టించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే అన్నారు. రైతులకు రైతుబంధు, రుణమాఫీ చేస్తామని, చెప్పి కాలయాపన చేస్తూ, రైతులను మోసం చేసిన రేవంత్‌రెడ్డి మీద 420 కేసు వేయాలనీ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ కోఆప్షన్ రషీద్, మాజీ వైస్ ఎంపీపీ సలీమోద్దీన్, కాటం రమేష్, కేంద్రే రమేష్, దూట మహేందర్, లక్కారం మాజీ సర్పంచ్ సత్యన్న, కుర్సెంగా భూమన్న, సిడం సోనేరావు, దావుల రమేష్, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల అందజేత

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ కుటుంబానికి రూ.లక్ష 16 వేల కల్యాణలక్ష్మీ చెక్కులను శనివారం డిప్యూటీ తహసీల్దార్ మల్లేష్, ఆర్ఐ సునీత, బీఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో నాయకులు ఈర్ల అభిలాష్, మృణల్ గౌడ్, తుల హరీష్, నరేందర్, రాంప్రసాద్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణ దానంతో సమానం

నవతెలంగాణ-ఇచ్చోడ

రక్తదానం ప్రాణదానంతో సమానమని సీఐ భీమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్‌లో ఆవరణలో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సైలు పోలీస్ సిబ్బంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని యువతీ, యువకులు, వ్యాపార వేత్తలు, ఉద్యోగులు స్వచ్ఛంద రక్తదానం చేసినట్టు సీఐ భీమేష్ తెలిపారు. రక్తదానం ద్వార చాల మంది రోగుల ప్రాణాలను కాపాడంలో మీ పాత్ర కీలకం కానుందన్నారు. రక్తదానం ప్రమాదకరం కాదని, ఇది రక్త పునరుద్ధరణకు సహాయపడే మంచి కార్యమని అన్నారు. కార్యక్రమంలో సీఐ భీమేష్, ఎస్సై తిరుపతి, నేరడిగొండ, సిరికొండ, గుడిహత్నూర్ ఎస్సైలు, పోలీసు సిబ్బంది, యువకులు పాల్గొన్నారు.

ఇక లెక్క పక్కాగా..

- 21వ జాతీయ పశుగణన ప్రారంభం
- ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల నియామకం
- ప్రత్యేక యాప్ ద్వారా లెక్కింపు



సమీక్ష నిర్వహిస్తున్న పశుసంవర్థక శాఖ అధికారి(ఫైల్)

నవతెలంగాణ-కెరమెరి

పశువుల లెక్క ఇకపై పక్కాగా ఉండనుంది. పశుసంవర్థక శాఖ జాతీయ పశుగణన కార్యక్రమాన్ని చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. దేశ వ్యాప్తంగా ప్రతి ఇంటిలో ఎన్ని పశువులున్నాయో.. లెక్కించేందుకు శుక్రవారం జిల్లా పశుసంవర్థక అధికారి మంద్రు సురేష్ సమావేశం నిర్వహించి పశు గణనపై సమీక్ష ఏర్పాటు చేశారు. జిల్లాలో 15 మండలాల్లో పశుగణన చేపట్టనున్నారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ళ, ఇలా అన్ని రకాల పశువుల వివరాలను సేకరించి డిజిటల్ విధానంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ప్రతి ఐదేండ్లకోసారి దేశవ్యాప్తంగా పశుగణన చేపడతారు. చివరిగా 2018లో 20వ పశుగణన నిర్వహించారు. జాతీయ స్థాయిలో దేశమంతా అక్టోబరు 25 నుంచి 24 ఫిబ్రవరి 2025 వరకు నాలుగు నెలల పాటు 21వ పశువుల లెక్కింపు ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పక్కాగా పశుగణన కోసం 86 మంది ఎన్యుమరేటర్లు, 11 మంది సూపర్‌వైజర్లను నియమించి పశువుల లెక్కింపు విధానంపై శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించారు. జిల్లాలో ప్రస్తుతం 2019 గణన ప్రకారం 2,93,3845 తెల్లజాతి పశువులు ఆవులు, ఎద్దులు, గేదెలు 4,6374, గొర్రెలు 1,59349, మేకలు 2,56854, కుక్కలు 907, సీమకోళ్లు, కోళ్ళ 440257, జెర్సీ 290 ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లా పశువైద్యాధికారి నేతృత్వంలో సన్నాహక సమావేశం నిర్వహించి పశుగణన ఉద్యోగ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.

పశుగణన విధానం...

పశుగణన కోసం ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది. ఇంటి యజమాని వివరాలతో పాటు భూమి, పశువుల వివరాలు, పాడి పశువులు, జెర్సీ, ఇతర ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, కోళ్ళ తదితర మూగజీవాల వివరాలను సేకరిస్తారు. ఆ వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా అప్‌లో నమోదు చేస్తారు. సంకర జాతి, దేశీయ జాతి పశుసంపదను వేరువేరుగా సేకరిస్తారు. ప్రతి అంశానికి ఒక విశిష్ట సంఖ్యను కేటాయిస్తారు. మొత్తం 41 కాలమ్స్‌లో పశువులకు సంబంధించిన వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది.

పథకాల రూపకల్పనకు అవకాశం...!

ఈ పశుగణన ద్వారా గతంతో పోల్చితే పశువుల (జీవజాతుల) సంఖ్య ఏ మేరకు పెరిగిందనేది తెలిసిపోతుంది. తద్వారా అవసరాల మేరకు పశు వైద్యశాలలు, పశువైద్యులు, సిబ్బంది, మందులు ఉన్నాయా..? పశుజాతుల సంఖ్యవంటి అంశాలను ప్రభుత్వాలు అంచనా వేసుకునేందుకు దోహదపడనుంది. ఈ సర్వే గణాంకాల వివరాలకనుగుణంగా పాడి పరిశ్రమ తీరు, వాటి అభివృద్ధి, పశుగణాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు, నిధుల కేటాయింపు, పథకాల రూపకల్పన, అమలు వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించి చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది.

పశుగణనకు ఏర్పాట్లు పూర్తి

డా. మంద్రు సురేష్, జిల్లాపశుసంవర్థక శాఖాధికారి



దేశవ్యాప్త పశు గణనలో భాగంగా ఈనెల 25 నుంచి జిల్లాలో పశువుల లెక్కింపు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాలో పశుగణనకు గాను 86 మంది ఎన్యుమరేటర్లను, పరిశీలనకు 11 మందిని సూపర్‌వైజర్లను నియమించి పశుగణన విధానం, పరిశీలనపై శిక్షణ ఇచ్చాం. నాలుగు నెలల పాటు క్షేత్ర స్థాయిలో పశువుల వివరాలను డిజిటల్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. గణన కోసం ఆయా గ్రామాల్లో ఇళ్లకు వచ్చే ఎన్యుమరేటర్లకు ప్రజలు, రైతులు, పెంపకందారులు సమాగ్ర సమాచారం ఇచ్చి సహకరించాలి.

నజ్రూల్‌నగర్‌లో ఉద్రిక్తత

- అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు కొనసాగిన అల్లర్లు
- అల్లర్లలో పోలీసులకూ స్వల్పగాయాలు
- ధ్వంసమైన పోలీసు వాహన అద్దం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ విలేజ్ నెంబర్-5లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. అర్ధరాత్రి (శనివారం తెల్లవారుజామున రెండు గంటల) నుండి ఉదయం తొమ్మిది గంటల వరకు ఈ ఉద్రిక్తత కొనసాగింది. చివరికి పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ఈ అల్లర్లలో పోలీసు వాహన అద్దం ధ్వంసం కాగా, ఇద్దరు పోలీసు అధికారులకు స్వల్పగాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఒక సామాజిక వర్గానికి చెందిన యువకుడు అర్ధరాత్రి సమయంలో నజ్రూల్‌నగర్ విలేజ్ నెంబర్-5లో అనుమానస్పదంగా తచ్చాడుతున్న సమయంలో అక్కడ ఉన్న యువకులు పట్టుకున్నారు. వేరే సామాజిక వర్గానికి చెందిన ఆ యువకుడు తమ గ్రామానికి చెందిన ఒక యువతిని వేధిస్తుండడంతో గ్రామ యువకులు ఆ యువకుడిని పట్టుకొని చెట్టుకు కట్టేసి చితకబాదారు. విషయం తెలుసుకున్న కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్, టౌన్ ఎస్ఐ దీకొండ రమేష్, ఈజ్‌గాం ఎస్ఐ రామన్‌కుమార్‌లు అక్కడికి చేరుకొని గ్రామ యువకులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయినా వినకపోవడంతో పోలీసులు, యువకులకు మధ్య తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. ఈ తోపులాటలో టౌన్ ఎస్ఐ దీకొండ రమేష్‌కు గాయం కాగా టౌన్ సీఐ రాజేంద్రప్రసాద్ కూడా స్వల్పంగా గాయపడ్డాడు. యువకులు ఆగ్రహంతో పోలీసు వాహనం వెనక అద్దాన్ని ధ్వంసం చేశారు. చివరికి పోలీసులు ఆ యువకుడిని అక్కడి నుండి పోలీసు వాహనంలో తరలించారు. అనంతరం గ్రామస్తులు అక్కడి నుండి ఈజ్‌గాం పోలీసుస్టేషన్‌కు వెళ్లి యువకునిపై ఫిర్యాదు చేశారు.



పోలీసులు, యువకులకు మధ్య జరుగుతున్న తోపులాట

పేద ప్రజల సంక్షేమానికి పెద్ద పీట

- ఎమ్మెల్సీ దండే విఠల్
- గూడెం ప్రధాన రహదారికి మరమ్మతులు



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్సీ విఠల్

నవతెలంగాణ-చింతలమానేపల్లి

పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మహారాష్ట్రకు వెళ్లే గూడెం ప్రధాన రహదారికి గుంతలు ఏర్పడి రోడ్డు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గూడెం నుండి మండల కేంద్రానికి 21 కిలోమీటర్లు ఉండగా గూడెం నుండి మండల కేంద్రానికి రావడానికి రెండున్నర నుండి మూడు గంటల సమయం పడుతుంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ దండే విఠల్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి సమస్యలపై సీఎం, ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఎస్డీఫ్ కింద రూ.76 లక్షలను తాత్కాలిక మరమ్మతుల కోసం మంజూరు చేశారన్నారు. ఫ్లడ్ డ్యామేజ్‌లో దెబ్బతిన్న రహదారుల కోసం సిర్పూర్ నియోజకవర్గానికి సుమారు రూ.కోటి 50 లక్షలు, జిల్లాకు రూ.3 కోట్ల చొప్పున నిధులు కేటాయించడం జరిగిందన్నారు. అనంతరం దింద, కేతిని వాగుని పరిశీలించి అటవీ శాఖ అనుమతులు లేక హై లెవెల్ వంతెన నిర్మించేందుకు సమయం పడుతుందని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డుబ్బుల నానయ్య, టీపీసీసీ సభ్యులు అర్షద్ హుస్సేన్, నాయకులు రాచకొండ శ్రీవర్ధన్, ఉమ మహేష్, బింకరి నారాయణ, డోకే జలపతి, నికాడి గణేష్, నిషట్టిరి సత్తి, మేకల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శించిన ఎమ్మెల్సీ

మండలంలోని కేతిని ఆశ్రమ పాఠశాలను ఎమ్మెల్సీ దండే విఠల్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలో ఉన్న వసతులపై ఆరా తీస్తూ మరుగుదొడ్లకు తలుపులు లేక, భోజనశాలలో డైనింగ్ హాల్ లేక, విద్యార్థులు కింద కూర్చోని భోజనం చేసేందుకు కనీసం చటాయిలు కూడా లేక, పాఠశాల ఆవరణలో చెట్టు కింద కూర్చోని భోజనం చేస్తున్న విద్యార్థులను చూసి చలించిపోయారు. ఈ విషయంపై సంబంధిత అధికారి ఐటీడీఏ పీఓ దృష్టికి తీసుకెళ్లి పాఠశాలకు కావాల్సిన సదుపాలను సమకూరుస్తామన్నారు. విద్యార్థుల చదువు విషయంపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకొని పాఠశాలకు మంచి పేరు తేవాలని సూచించారు.

ఒకే రోజు ఏడు వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవతెలంగాణ-భైంసా

కుంటాల, నర్సాపూర్ మండలాల్లో శనివారం ఒకే రోజు ఏడు వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే రామారావు పటేల్ ప్రారంభించారు. ఉదయం 9గంటల నుండి ఆయన కుంటాల మండలంలో పర్యటించారు. వరి రైతాంగానికి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా మద్దతు ధర ఇచ్చేందుకు కుంటాల మండలంతో పాటు నర్సాపూర్ మండలంలో ఒకే రోజు ఏడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కుంటాల మండలంలోని లింబా(కె), అంబకంటి గ్రామాలతో పాటు నర్సాపూర్ మండలంలోని గొల్లమాడ, నందన్, డోంగూర్‌గాం, చాక్‌పెల్లి, బూరుగుపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో తమ పంటను అమ్మాలన్నారు. మద్దతు ధర కల్పించేందుకు గతం కంటే భిన్నంగా ఎక్కువగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు.



ఈఎస్ఐలో జాయింట్ డైరెక్టర్ విచారణ



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో శనివారం వరంగల్ జాయింట్ డైరెక్టర్ హేమలత విచారణ చేపట్టారు. ఈఎస్ఐ డిస్పెన్సరీకి చెందిన మందులు ఇటీవల కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ మందుల దుకాణంలో విక్రయిస్తుండగా పట్టుకున్న విషయం తెల్సిందే. దీనిపై డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చేసిన ఫిర్యాదు మేరకు జేడీ హేమలత ఆసుపత్రికి వచ్చి విచారణ చేపట్టారు. సిబ్బందితో సమావేశమై వివరాలు సేకరించారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చేసిన ఫిర్యాదు మేరకు విచారణకు ఇక్కడిక వచ్చానని, తన నివేదికను ఉన్నతాధికారులకు ఇస్తానని ఈ సందర్భంగా జేడీ హేమలత స్పష్టం చేశారు. డిస్పెన్సరీకి సమీపంలోనే పాడుబడ్డ క్వార్టర్‌లో రెండేళ్ల క్రితమే గడువు తీరిన మందుల కార్టన్లు ఉన్నట్లు ఆమె దృష్టికి రాగా వాటిపై విచారణ చేపడుతానని అన్నారు. డిస్పెన్సరీలో అందుబాటులో ఉంచాల్సిన మందులు పాడుబడ్డ క్వార్టర్‌లో ఎందుకు నిల్వ చేశారనేది ఇక్కడ అనుమానంగా మారింది. కార్టన్లలో వచ్చిన ఈ మందులను తెరిచి చూసినట్లుగా కూడా ఆనవాళ్ల లేవు. ఈ మందుల డబ్బాలను తెరువకముందే గడువు తీరి పోయి ఉన్నాయి.

కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల రగడ



నవతెలంగాణ-భైంసా

భైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ల నియామకంలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన కార్యకర్తలకు అవకాశం ఇవ్వకుండా ఇతర పార్టీల నుంచి వలస వచ్చిన నాయకులకు డైరెక్టర్ల పదవి ఇవ్వడం ఏంటని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు నారాయణరావు పటేల్ అనుచరులు ఫిర్యాదు చేశారు. మొదటి నుంచి పార్టీలో కొనసాగుతూ, చిత్తశుద్ధి, అంకితభావంతో పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి నారాయణరావు పటేల్ రాసిన లేఖను, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి అందజేసినట్లు తెలిసింది. భైంసా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కొందరు డైరెక్టర్లు ఎన్నికల్లో ఇతర పార్టీలకు పనిచేశారని, వారికి పదవులు ఎలా ఇస్తారని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ప్రస్తుతం బాసర ఆలయ కమిటీ పాలకవర్గ సభ్యులు, కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్‌ల పదవులు, ఆత్మ చైర్మన్‌తో పాటు ఇతర పదవులు కష్టపడ్డ కార్యకర్తలకు ఇవ్వాలని వారు విన్నవించారు. ఇటీవల పార్టీలో చేరిన వారిపై సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. మంత్రి సీతక్కను కలిసిన వారిలో మాజీ ఎంపీపీ రామచంద్రారెడ్డి, బాసర మాజీ సర్పంచ్ ముమ్మాయి రమేష్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, బెజ్జంకి ముత్యంరెడ్డి, కుభీర్ మండల కాంగ్రెస్ నాయకులు రమేష్ ఉన్నారు.

పెద్దపులి సంచారం

నవతెలంగాణ-హాజీపూర్

మండలంలో పులి సంచారం కలకలం రేపింది. శనివారం మండలంలోని ధర్మారం అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ అధికారులు ధృవీకరించారు. ధర్మారం నుండి బుగ్గగట్టు, గుడిపేట్, ర్యాలీ ప్రాజెక్ట్ వైపు వెళ్తున్నట్లు గుర్తించిన అధికారులు ఆయా గ్రామాల్లో సాయంత్రం డప్పు చాటింపు వేయించారు. పశువులను మేతకోసం అడవులకు పంపవద్దని హెచ్చరించారు. వంట చెరుకు కోసం ఎవరూ అడవులకు వెళ్లవద్దని అవగాహన కల్పించారు.

పీఎం విశ్వకర్మను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కులవృత్తుల వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చడంతో పాటు స్వయం ఉపాధి దిశగా ప్రోత్సాహం అందించే లక్ష్యంతో ప్రారంభించిన పీఎం విశ్వకర్మను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయల శంకర్ సూచించారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకంలో భాగంగా శనివారం జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణను పూర్తి చేసుకున్న వారికి శనివారం ధృవపత్రాలు అందించారు. టైలరింగ్, బ్యూటీషియన్, రజక వృత్తిదారులకు నైపుణ్య శిక్షణను అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పాయల శంకర్‌కు స్వాగతం పలికి సత్కరించారు. కాగా పథకం అమల్లో సాంకేతిక సమస్యలు ఏర్పడి లబ్ధిదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని జన శిక్షణ సంస్థాన్ చైర్మెన్ సురేందర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషన్ రాజు, పీఎం విశ్వకర్మ ప్రోగ్రాం అధికారి రాజేందర్, డైరెక్టర్ శ్యామల, బీజేపీ నాయకులు ఆదినాథ్, సంజయ్, క్రిష్ణ, లాలామున్న పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం నిర్మల్ రూరల్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన బక్కొల్ల చిన్న సాయన్న(35) మిషన్ భగీరథలో హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. కాగా శనివారం విధులు ముగించుకొని సాయంత్రం తన స్నేహితుడు మొహమ్మద్ మునీరుద్దీన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై తల్వేదకు వస్తుండగా అదే సమయంలో నిర్మల్ నుంచి భైంసా వెళుతున్న లోకేశ్వరంకు చెందిన అల్లోల రవి ద్విచక్రవాహనంతో వచ్చి ఢీకొట్టాడు. దీంతో బక్కొల్ల చిన్న సాయన్న, మొహమ్మద్ మునీరుద్దీన్‌లకు తలకు గాయాలయ్యాయి. బక్కొల్ల చిన్న సాయన్నను నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షిస్తుండగా మృతిచెందినట్టు తెలిపారు. ప్రమాదానికి కారణమైన అల్లోల రవికి, అతని వెనుక కూర్చున్న మెట్టు కన్నయ్యలకు గాయాలైనట్ట ఎస్సై తెలిపారు.

బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణం పద్మావతినగర్ కాలనీలోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి 40వ బ్రహ్మోత్సవాల, జాతర మహోత్సవానికి సంబంధించిన కరపత్రాలను శనివారం మున్సిపల్ చైర్మెన్ రాజురా సత్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మాండంగా కన్నుల పండుగ జరుగుతుందన్నారు. బ్రహ్మోత్సవాలు నవంబర్ 12 మంగళవారం నుంచి ప్రారంభమై నవంబర్ 16శనివారం వరకు ఆలయంలో పూజా కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కిషోర్ నాయక్, ఆలయ కమిటీ అధ్యక్షులు అడ్డగట్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేష్, యూత్ అధ్యక్షులు రామ్ అన్వేష్, ఆలయ కమిటీ సభ్యులు తుమ్మనపల్లి లక్ష్మణ్, లింగాల రాము, ఉషకోలా సుధాకర్, రామ్ భీమన్న, లింగాల లక్ష్మణ్, లోకిని జూని, నడిమట్ల సురేష్, శేషాద్రి, చైతన్య ఫణిధర్, శికారి శంకర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.